ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 24, ఆగస్టు 2025

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, వేదికపై రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇతర నేతలు





కదంతొక్కిన ఎర్రదండు

ఉత్సాహంగా సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి
సీపీఐ రాష్ట్ర మహాసభలో నేతల పిలుపు

- ఎరుపెక్కిన ఒంగోలు
- ఆకర్షణీయంగా కళాకారుల ప్రదర్శనలు
- రెడ్ షర్ట్‌లతో వలంటీర్ల క్రమశిక్షణ
- నగర ప్రజలను ఆకర్షించిన ర్యాలీ
- అగ్రభాగాన నిలిచిన రాష్ట్ర నేతలు
- సురవరం మృతితో అగ్రనేత రాజా పర్యటన రద్దు
- మతోన్మాద పార్టీలను నిలువరించేందుకు ఉద్యమించాలని పిలుపు



ఎర్రజెండా రెపరెపలతో ఒంగోలు ఎరుపెక్కింది. సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా వేలాది మంది ఆ పార్టీ శ్రేణులు నగరంలో కదం తొక్కాయి. ఎర్రజెండాలు చేబూని డప్పు నృత్యాలు, కోలాటాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఒకవైపు.. క్రమశిక్షణతో యువ కమ్యూనిస్టు కార్యకర్తలు జెండాలు చేతపట్టి చేసిన మార్చ్‌ఫాస్టుతో మరోవైపు నగరం హోరెత్తింది.

ఒంగోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మూడు రోజుల పాటు జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆపార్టీ శ్రేణులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన వేలాది మంది శనివారం మధ్యాహ్నానికి నగరానికి చేరుకున్నారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని మునిసిపల్ గ్రౌండ్స్ నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటలకు ర్యాలీ ప్రారంభమైంది. కలెక్టరేట్, చర్చి సెంటర్, ట్రంకురోడ్డు, పాత మార్కెట్, బాపూజీ కాంప్లెక్స్, అద్దంకి బస్టాండు, కర్నూలు రోడ్డు కూరగాయాల మార్కెట్

మిగతా 4వ పేజీలో



4

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

- 20,493 మందికి ర్యాంకుల ప్రకటన
- మహిళలదే పైచేయి



సోషల్ స్టడీస్‌లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటహర్షితకు మిఠాయి తినిపిస్తున్న కనిగిరి ఎంఈవో రామిరెడ్డి, ఏఎస్‌వో రమణారెడ్డి

ఒంగోలు విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-25 అభ్యర్థుల మెరిట్ జాబితాను శుక్రవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షకు హాజరైన అభ్యర్థులకు రాతపరీక్షల్లో వచ్చిన మార్కులు, టెట్ మార్కులు కలిపి ర్యాంకులు ప్రకటించారు. మెరిట్ జాబితాను రాష్ట్ర, జోనల్, జిల్లాస్థాయి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. జిల్లాస్థాయిలో డీఈవో వెబ్‌సైట్‌లో కూడా మెరిట్ జాబితాలను ఉంచారు. అభ్యర్థుల మొబైల్‌కు వారు సాధించిన మార్కులు, ర్యాంకుల వివరాలను మెసేజ్ చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన వారి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతారు. అభ్యర్థులు తమ లాగిన్ ద్వారా కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకొని సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలి. అయితే పరిశీలన ఎప్పుడు నిర్వహించేది పాఠశాల విద్యాశాఖ ఇంకా ప్రకటించలేదు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డీఈవోలను పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశించారు. మెరిట్ జాబితాలో పురుషుల కంటే మహిళలే ముందంజలో ఉన్నారు.

672 పోస్టులకు 20,493 మంది

జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 672 పోస్టులకు డీఎస్సీ

మిగతా 4వ పేజీలో

పరిశీలకులుగా తహెరా సుల్తానా

మెగా డీఎస్సీ జిల్లా పరిశీలకులుగా పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ తహెరా సుల్తానా నియమితులయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రమైన ఒంగోలు సమీపం చెరువుకొమ్ముపాలెంలోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో శనివారం పరిశీలనకు నియమించిన 18 టీంలకు శిక్షణ ఇచ్చారు. 14 టీంలు జిల్లా స్థాయి పోస్టులకు, మిగిలిన నాలుగు టీంలు జోనల్, రాష్ట్ర స్థాయి పోస్టుల అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తాయి. శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో సుల్తానా కూడా మాట్లాడారు. సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించిన పలు అంశాలను ఆమె వివరించారు.



ఒంగోలులో ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి

ఆంధ్రకేసరికి ఘన నివాళి

ఒంగోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. ఆ మహనీయుని విగ్రహాలు, చిత్రపటాలకు పలు రంగాల వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకవైపు ప్రభుత్వపరంగా అధికార యంత్రాంగం, మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం వద్ద జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు. తొలుత ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని లాయర్‌పేట రైతుబజారు, సీవీఎన్ రీడింగ్ సెంటర్‌లో ఉన్న విగ్రహాల వద్ద పలుసంస్థల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ప్రకాశం పంతులు స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. ఒంగోలు రూరల్ మండలం దేవరంపాడులోని విజయ స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేసీ గోపాలకృష్ణ హాజరయ్యారు. గిద్దలూరులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని ప్రకాశం పంతులుకు ఘనంగా నివాళులర్పించారు. అలాగే జిల్లాలోని పలుప్రాంతాల్లో విద్యాసంస్థలు, ఇతర కార్యాలయాల్లో జయంతి వేడుకలు జరిగాయి. స్వాతంత్ర్యం కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాలను, ఆయన నిరాడంబరతను ఈ సందర్భంగా ప్రముఖులు కొనియాడారు.

అర్హుల పింఛన్లను తొలగించం

మంత్రి డాక్టర్ స్వామి వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అర్హుల పింఛన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. అనర్హుల పింఛన్లు ఉంటే మాత్రం తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ శనివారం జరిగిన ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి స్వామి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా దివ్యాంగులు, ఇతర సామాజిక పింఛన్లను క్రమం తప్పకుండా ఒకటో తేదీనే ఇస్తున్నామని తెలిపారు. డీఆర్సీ సమావేశంలో కూడా అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ చేసి అనర్హులను తొలగించినట్లు తెలిపారు. అర్హులకు ఎలాంటి అన్యాయం జరగదని మంత్రి స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను

మిగతా 4వ పేజీలో

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

- ఒంగోలులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్
- పలుచోట్ల కీలక నేతలు, ఉన్నతాధికారులు హాజరు
- పరిశుభ్రతపై ర్యాలీలు, ప్రతిజ్ఞలు



ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పలుప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు భాగస్వాములయ్యారు. పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించారు. పలుచోట్ల మురుగు కాలువలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నివారణ మందును మురుగు కాలువలు, ఇతరత్రా మురుగు ఉన్న ప్రాంతాల్లో స్ప్రే చేశారు. ప్రతినెలా మూడో శనివారం ఒక్కో ప్రాధాన్యత అంశంతో ప్రజాప్రభుత్వం పరిశుభ్రత కార్యక్రమాలను స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో నిర్వహిస్తోంది. గత శనివారం కృష్ణాష్టమి పర్వదినం కావడంతో ఈ నెల కార్యక్రమాన్ని ఈ శనివారం నిర్వహించారు. చేతుల పరిశుభ్రత- కాలువల పరిశుభ్రత అంశంపై ఈ వారం అవగాహన, ఇతర కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాలు, సచివాలయం యూనిట్‌గా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, వైద్యశాలల్లో ప్రత్యేకంగా చేపట్టారు. ఒంగోలులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయమైన ప్రకాశం భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎన్‌జీపాడు మండలం వినోదరాయునిపాలెంలో జరిగిన కార్యక్రమానికి ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ హాజరయ్యారు. గిద్దలూరులోని మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో అక్కడి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. దర్శి పట్టణంలోని ఏడో వార్డులో టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మునిసిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యలు పాల్గొని కాలువలను శుభ్రం చేశారు. మండల కేంద్రమైన ఎర్రగొండపాలెం పోతురాజుగడ్డ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లోని వందలాది విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలల్లో ఉత్సాహంగా కార్యక్రమం సాగింది.

పార్టీ పదవులపై టీడీపీ దృష్టి

తెలుగుదేశం

అధికార తెలుగుదేశం పార్టీ పదవుల ఎంపిక కోసం వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికకు ప్రాధాన్యమిచ్చింది. ఆ మేరకు నియోజకవర్గం నుంచి కిందిస్థాయి వరకు ముఖ్యనేతల అభిప్రాయాలతో జాబితాలు రూపొందించేందుకు సిద్ధమైంది. అందులోభాగంగా ఆదివారం ఒంగోలులో లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది.

- లోక్‌సభ అధ్యక్షుడు, అనుబంధ సంఘాల ఎంపిక కోసం కసరత్తు
- నేడు ఒంగోలులో అభిప్రాయ సేకరణ
- మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ రాక
- ఎమ్మెల్యే నుంచి పార్టీ మండల అధ్యక్షుల వరకు ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పార్టీ, నామినేటెడ్ పదవుల ఎంపికలో టీడీపీ అధిష్ఠానం జాప్యం చేయడంపై కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దానిని గమనించి ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పదవుల భర్తీకి శ్రీకారం పలికారు. అందులోభాగంగా లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ, అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపిక కోసం అభిప్రాయ సేకరణకు నిర్ణయం తీసుకున్నారు. అందుకుగాను ప్రతి లోక్‌సభకు ముగ్గురు సభ్యులతో త్రిసభ్య కమిటీలను నియమించారు. ఆ కమిటీ సభ్యులకు శనివారం సాయంత్రం అమరావతిలో ఆయన ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఆ మేరకు ఒంగోలు లోక్‌సభ ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం ఒంగోలులోని గుంటూరు రోడ్డులో ఉన్న ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. పార్టీ నియమించిన మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ సభ్యులు రానున్నారు. వీరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలతో సమావేశమవుతారు. సమావేశానికి ప్రతి నియోజకవర్గం నుంచి 30మంది ఆయా ముఖ్యపదవుల్లో ఉన్న వారిని కూడా ఆహ్వానించారు. వీరందరి నుంచి ఒంగోలు లోక్‌సభ పార్టీ అధ్యక్ష పదవి తీసుకునేందుకు సిద్ధమైన వారి పేర్లను సేకరిస్తారు. అలాకాకుండా

మిగతా 4వ పేజీలో

శభాష్ పోలీస్!

- కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన మార్కాపురం యువకుడు
- సకాలంలో వెళ్లి రక్షించిన పోలీసులు
- కంభంలో మహిళను కాపాడిన వైనం



రైల్వే ట్రాక్ వద్ద ఉన్న యువకుడిని కాపాడి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని మార్కాపురం రూరల్ పోలీసులు శనివారం సకాలంలో వెళ్లి రక్షించారు. రూరల్ ఎస్ఐ అంకమరావు తెలిపిన వివరాల మేరకు.. మార్కాపురం పట్టణానికి చెందిన టి.సురేంద్ర అనే యువకుడు తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్ వైపు వెళ్లాడు. ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులు మార్కాపురం రూరల్ పోలీసులకు తెలిపారు. వెంటనే ఎస్ఐ అంకమరావు ఐటీ కోర్ టీమ్ సహాయంతో సురేంద్ర ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. రైల్వేట్రాక్ వద్దకు చేరుకుని అతని ప్రాణాలను కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులకు వారు కృతజ్ఞతలు

మిగతా 4వ పేజీలో

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

5

పాము కాటుకు గురై ముండ్లమూరు సర్పంచ్ మృతి

దర్శి సబ్ జైలును పరిశీలించిన డీఐజీ

కదంతొక్కిన ఎర్రదండు

(3వ పేజీ తరువాయి)

మీదుగా సాగింది. ముందు భాగాన కళాకారుల నృత్యాలు, 28వ రాష్ట్ర మహాసభలకు సూచికగా 28 మంది యువ కమ్యూనిస్టులు జెండాలు చేబూనగా వందలాది మంది మహిళలు సీపీఐ జెండాలు, ఎర్ర గొడుగులతో వారిని అనుసరించారు. ఆ వెనుక ప్రముఖులు బ్యానర్ పట్టుకొని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఇతర ముఖ్య నేతలు రావుల వెంకయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, సినీనటుడు మాదాల రవి, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు నడిచారు. వారి వెనుక వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది ర్యాలీలో సాగారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ర్యాలీ నగరవాసులను విశేషంగా ఆకర్షించింది. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో కమ్యూనిస్టులు ర్యాలీ నిర్వహించిన పరిస్థితి లేకపోగా నగర ప్రజల్లో ఇంతమంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఉన్నారా? అన్న చర్చ సాగింది. కాగా ర్యాలీ అనంతరం కొత్త మార్కెట్ సమీపంలోని మైదానంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులు

పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గసభ్యులు, అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు కమ్యూనిస్టు కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా పూర్వపు ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందడంతో కొంత విషాదంలో ఆ పార్టీశ్రేణులు ఉన్నప్పటికి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బహిరంగ సభలో పాల్గొనాల్సిన సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా పర్యటన మాత్రం రద్దయింది. బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనాల్సి ఉండగా సురవరం మృతితో హైదరాబాద్‌లోనే రాజా ఆగిపోయారు. కాగా సురవరం మృతికి బహిరంగ సభావేదికపై నుంచి నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. సురవరం చిత్రపటానికి డాక్టర్ కె.నారాయణ, ఇతర ముఖ్యనేతలు పూలమాలలు వేసి నివాళులర్పించగా సభకు హాజరైన వేలాదిమంది రెడ్ సెల్యూట్ అంటూ నినదించారు. ఆది, సోమవారాల్లో నగర పరిధిలోని ఎస్‌జీవీఎస్ ఫంక్షన్ హాలులో సీపీఐ ప్రతినిధుల సభలు జరగనున్నాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ నేతృత్వంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఉత్తేజపరిచాయి.

పార్టీ పదవులపై టీడీపీ దృష్టి

(3వ పేజీ తరువాయి)

ఎవరి పేర్లు అయినా సిఫార్సు చేసినా వాటినీ నమోదు చేసుకుంటారు. అలాగే సుమారు 14 అనుబంధ సంఘాలకు సంబంధించి ప్రధానమైన అధ్యక్ష, కార్యదర్శుల ఎంపికపై కూడా అభిప్రాయాలు సేకరిస్తారు. పార్టీ అధ్యక్ష పదవిలో ఎంపీ, ఎమ్మెల్యేలు సహా ఎవరైనా ఉండేందుకు అవకాశం ఉంది. అలాగే అనుబంధ సంఘాలకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో చర్చించి అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా చూసే అవకాశం ఉంది. మొత్తంగా పార్టీ అధ్యక్ష పదవికి మూడు పేర్లకు తగ్గకుండా ఒక జాబితాను రూపొందిస్తారు. ఆయా సామాజికవర్గాలు, ఇతర అంశాలకు కూడా ప్రాధాన్యమిస్తూ ఔత్సాహికుల పేర్లను సేకరిస్తారు. తదనుగుణంగా సేకరించిన సమాచారానికి అనుగుణంగా రూపొందించిన జాబితాను పార్టీ అధ్యక్షునికి అందజేస్తారు. ఆ తర్వాత చంద్రబాబునాయుడు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికను పూర్తిచేసి ప్రకటిస్తారు. కాగా కొత్త జిల్లాలు ఏర్పడినా లోక్‌సభ పరిధిలోనే పార్టీ కమిటీ పనిచేస్తుందని అందువలన కొత్త జిల్లాల ఏర్పాటుకు అతీతంగా పార్టీ అధ్యక్ష పదవికి అభ్యర్థుల ఎంపిక జరగాలని చంద్రబాబునాయుడు కమిటీసభ్యులకు సూచించారు.

అర్హుల పింఛన్‌లను తొలగించం

(3వ పే.జీ తరువాయి)

దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో వెరిఫికేషన్ (పరిశీలన) చేస్తున్నారన్నారు. ఎక్కడైనా పొరపాటు జరిగితే పునఃపరిశీలించి పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అర్హత ఉంటే నోటీసులు ఇస్తే సచివాలయంలో అప్పీల్ చేసుకోవచ్చని మంత్రి స్వామి తెలిపారు. సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ పోస్టులకు సంబంధించి 20,493 మంది అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు ప్రకటించారు.

132 ఎస్‌జీటీ పోస్టులకు 9,074 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో 94.06 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కేవలం 19.24 మార్కులు సాధించిన అభ్యర్థి చివరి స్థానంలో నిలిచారు.

స్కూలు అసిస్టెంట్ తెలుగు 41 పోస్టులకు 863 మంది పరీక్ష రాయగా 84.82మార్కులతో ప్రథమ స్థానం, 23.0మార్కులతో చివరిస్థానం పొందారు.

స్కూలు అసిస్టెంట్ హిందీ 27 పోస్టులకు 433 మంది పోటీపడగా 82.17 మార్కులతో ప్రథమ స్థానంలో, 26.50 మార్కులతో చివరి స్థానంలో నిలిచారు.

స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు 99 పోస్టులకు 842 మంది పరీక్షలు రాయగా గరిష్ఠంగా 91.32శాతం, కనిష్ఠంగా 26.28 మార్కులు సాధించారు.

స్కూలు అసిస్టెంట్ గణితం 95 పోస్టులకు 2,794 మంది పరీక్షకు హాజరుకాగా వీరిలో అత్యధికంగా 93.01 మార్కులు, అత్యల్పంగా 21.59 మార్కులు సాధించారు.

స్కూలు అసిస్టెంట్ పీఎస్ 26 పోస్టులకు 753 మంది పరీక్షకు హాజరు కాగా వీరిలో అత్యధికంగా 84.27 మార్కులు, అత్యల్పంగా 28.90 మార్కులు సాధించారు

స్కూలు అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ 72 పోస్టులకు 1,899 మంది పరీక్షకు హాజరుకాగా గరిష్ఠంగా 86.23 మార్కులు కనిష్ఠంగా 14.13 మార్కులు సాధించారు.

- స్కూలు అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పోస్టులు 108 పోస్టులకు 2,689 మంది పరీక్ష రాయగా అత్యధికంగా 85.13 మార్కులు, అత్యల్పంగా 22.74 మార్కులు సాధించారు.
- స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య 72 పోస్టులకు 1,195 మంది పరీక్ష రాయగా గరిష్ఠంగా 88.5 మార్కులు, కనిష్ఠంగా కేవలం 4.5 మార్కులు మాత్రమే సాధించారు.

మెగా డీఎస్సీ టాపర్లు

పోస్టుపేరు	అభ్యర్థిపేరు	మార్కులు
ఎస్ఏ తెలుగు	పుచ్చనూతల మనోహర్ (ఓసీ)	84.82
ఎస్ఏ హిందీ	చలువాది వి.నాగరాజు (ఓసీ)	82.17
ఎస్ఏ ఇంగ్లీషు	పిగిలి కవిత (బీసీడీ)	91.32
ఎస్ఏ గణితం	జంధ్యాల అంజని (ఓసీ)	93.01
ఎస్ఏ పీఎస్	ఎం.వెంకటకృష్ణారెడ్డి (ఓసీ)	84.27
ఎస్ఏ బీఎస్	ఈ.సుకేష్‌కుమార్ (బీసీబీ)	86.73
ఎస్ఏ ఎస్ఎస్	రావూరి వెంకటహర్షిత (ఓసీ)	85.13
ఎస్ఏ వ్యాయామవిద్య	పిల్లి వెంకటనారాయణ (ఎస్సీ-3)	88.5
ఎస్ఏ ఉర్దూ	షేక్ యాసీన్‌సాహెబ్ (బీసీఈ)	77.33
ఎస్‌జీటీ తెలుగు	గాలి లావణ్య (బీసీబీ)	94.06
ఎస్‌జీటీ ఉర్దూ	షేక్ అర్షియాతబ ఉసుమ్ (బీసీఈ)	69.43

ఆరు మండలాలకు



కొర్రపాటి వసంతరాయుడు, మించల బ్రహ్మయ్య, పోకూరి రవీంద్రబాబు, చదలవాడ చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు

టీడీపీ అధ్యక్షుల నియామకం

● పొన్నలూరు, జరుగుమల్లి మండలాలకు పాతవారే

కొండపి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు అధ్యక్షులను నియమించింది. పార్టీకి విశేష సేవలందించిన వారికి అవకాశం ఇచ్చింది. కొండపి మండల అధ్యక్షుడిగా అనకర్లపూడి గ్రామానికి చెందిన కొర్రపాటి వసంతరాయుడిని ఆ మండల నాయకులు ఎంపిక చేశారు. ఆయనకు రెండుసార్లు అధ్యక్షుడిగా అవకాశం వచ్చినట్లే వచ్చి చివరలో చేజారింది. ఈసారి వసంతరాయుడిని అధ్యక్షుడిగా మండల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సింగరాయకొండ మండల అధ్యక్షుడిగా పాతసింగరాయకొండ పంచాయతీకి చెందిన మించల బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సింగరాయకొండ మండల క్లస్టర్-9 ఇన్‌చార్జిగా బ్రహ్మయ్య క్రియాశీలకంగా పనిచేశారు. పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి, పాతసింగరాయకొండ, శానంపూడి, కనుమళ్ల, కలికివాయి గ్రామాల్లో 30 బూత్‌లు ఉండగా వీటిలో టీడీపీకి 3వేల పైచిలుకు మెజారిటీ సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు. టంగుటూరు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్‌ను ఆ మండల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించి ఎన్నుకున్నారు. పొన్నలూరు మండల సీనియర్ నాయకుడు అనుమోలు సాంబశివరావును ఆపార్టీ నాయకులు ఏకగ్రీవంగా వరుసగా రెండోసారి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మర్రిపూడి మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన యువ నాయకుడు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డిని ఆమండల నాయకులు పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. జరుగుమల్లి మండలం చతుకుపాడు గ్రామానికి చెందిన పోకూరి రవీంద్రబాబును వరుసగా మూడోసారి ఆ మండల నాయకులు ఏకగ్రీవంగా పార్టీ అధ్యక్షుడిగా ప్రతిపాదించారు. అన్ని మండలాల కమిటీ అధ్యక్షుల పేర్లను రాష్ట్ర పార్టీకి పంపుతామని, అంతిమ నిర్ణయం రాష్ట్ర కమిటీదేనని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రకటించారు. మిగతా కమిటీ సభ్యులను, అనుబంధ సంఘాల కమిటీలను, రాష్ట్ర కమిటీకి సభ్యులను త్వరలో ప్రతిపాదించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

కార్యకర్తల సంక్షేమానికి కృషి

● టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి డాక్టర్ స్వామి

● హాజరైన మారిటైం బోర్డు చైర్మన్ సత్య, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కొండపి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, వారి సంక్షేమానికి పార్టీ కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం స్థానిక కామేపల్లిరోడ్డులో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తున్నదన్నారు. సాధారణ మరణం సంభవించినా బీమా సౌకర్యం వర్తింపచేయాలని



మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై మారిటైం బోర్డు చైర్మన్ సత్య, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పార్టీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పార్టీ నిర్వహించిన అన్ని కార్యక్రమాలను కొండపి నియోజకవర్గంలో విజయవంతం చేశామన్నారు. జిల్లాలో తమ కుటుంబం కష్టకాలంలో కూడా పార్టీకి అంకితమై పనిచేసిందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచామన్నారు. రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కడప ప్రజలు తాజాగా జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీపై ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. అధికారం పోయినా జగన్ విచిత్రమైన మనస్తత్వంతో ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. టీడీపీకి కార్యకర్తలే నిజమైన బలమని, వారికి రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు వస్తాయన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేర్చిందని, పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ రాష్ట్ర మహాసభలో నేతలు పిలుపు ● అలరించిన ప్రజా కళాకారుల గీతాలు

ఒంగోలుక్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి. డబుల్ ఇంజన్ సర్కార్‌పై డబుల్ పోరాటాలు తప్పవు. రాష్ట్రంలో ఉన్న పేదలు ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించే వరకు అన్ని గ్రామాల నుంచి ఉద్యమాలు చేపట్టాలి. అందుకు ఎర్ర జెండా ముందు ఉండాలి. అదేవిధంగా వామపక్షపార్టీల పునరేకీకరణ జరిగి ఏకతాటిపైకి వచ్చి సమష్టిగా పోరుబాట పట్టాలి' అని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ ఆవరణలో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలలో భాగంగా బహిరంగ సభ జరిగింది. ముందుగా నెల్లూరు బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి కళకారుల డప్పుల దరువు, వివిధ రకాల విన్యాసాలు, కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో తొలుత సీపీఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ జాతీయ కార్యదర్శి కే .నారాయణ మాట్లాడుతూ నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన నక్సలిజంను అంతం చేయలేరన్నారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలు తన నియంత పాలనకు అడ్డు వస్తున్నాయని, వాటిని నిర్వీరం చేసే పనిలో పాలకులు ఉన్నారని చెప్పారు. గవర్నర్లు కేంద్రానికి దళారులుగా మారుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న మోదీకి చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లు రెండు కాళ్లుగా నిలబడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు స్వలాభం కోసం 100 ఎకరాలు భూమి అవసరం ఉంటే 1,000 ఎకరాలు కావాలని ఉబలాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. పూటకో వేషం రోజుకో మాట మారుస్తున్న పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని నెత్తికి ఎత్తుకొని తిరుగుతున్నాడని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ పేదల కోసం వందేళ్ల త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ అని తెలిపారు. ఆర్ఎస్ఎస్‌కు ఏనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదన్నారు. దొంగ ఓట్లతో బీజేపీ రాజ్యమేలుతుందని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని చెప్పారు. అలాంటి పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించే వరకు డబుల్ ఇంజన్ స్పీడ్‌తో పోరాటం చేయాలని, అందుకు ప్రజలు సమాయత్తం కావాలన్నారు.

అనంతరం సినీ హీరో, సీపీఐ నేత మాదాల రవి ప్రసంగించారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరావు, జేవివి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి.హరినాథరెడ్డి, జి.ఓబులేసు, పి.రామచంద్రయ్య, జగదీష్, కేవివి.ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్, డేగా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ పీజే.చంద్రశేఖర్, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

ఇస్కాన్ రథానికి ఎమ్మెల్యే స్వాగతం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇస్కాన్ పాదయాత్ర శుక్రవారం రాత్రి మార్కాపురం చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దంపతులు స్వాగతం పలికారు. రాధాకృష్ణుల విగ్రహంతో శ్రీకృష్ణ బలరాం రథం రోజుకు 15 కి.మీ. తిరుగుతూ మార్కాపురం చేరింది. ఈ సందర్భంగా రథానికి హారతి ఇచ్చి ఎద్దులకు అరటి పండ్లు, ఫలాలు తినిపించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు కూడా పూజలు చేశారు.

రేపు డీఎస్సీ సర్టిఫికెట్‌ల పరిశీలన : డీఈవో

ఒంగోలు(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 వివిధ కేటగిరీలకు సంబంధించిన మొత్తం 629 పోస్ట్‌లకు ఎంపిక కమిటీ నిర్ణయించిన అభ్యర్థులకు సోమవారం ఒంగోలు నగరపరిధిలోని చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో సర్టికెట్‌ల పరిశీలన జరుగుతుందని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల మొబైల్స్‌కు సర్టిఫికెట్‌ల పరిశీలను హాజరుకావల్సినదిగా మెసేజ్ వస్తుంది. ఆ మెసేజ్ వచ్చిన వారు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో పాటు మూడు సెట్‌ల జిరాక్స్ కాపీలను గజిటెట్ అధికారితో అటెస్టేషన్ చేయించి పరిశీలనకు తీసుకు రావాలని కోరారు. అభ్యర్థులు సులభంగా సర్టిఫికెట్‌ల పరిశీలన కేంద్రానికి చేరుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను(రూట్‌మ్యాప్) పాటించాలని ఆయన కోరారు.

సమాజంలో సానుకూలతను అన్నిస్థాయిల్లోకి తీసుకెళ్లాలి

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉమామహేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సానుకూల అంశాలను అన్ని స్థాయిలకు తీసుకెళ్ళాలని విద్యాభారతి క్షేత్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చామర్తి ఉమామహేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. పాశ్చాత్య దేశాల్లోని కొన్ని పెడధోరణలు మన విద్యాలయాల్లోకి ప్రవేశిస్తున్నాయన్నారు. శనివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో విశ్వభారతి క్షేత్ర(మూడు రాష్ట్రాల) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికవిధానాలతో విఫలమైన సిద్ధాంతాలు, ఇప్పుడు దారి మార్చుకొని విద్యావ్యవస్థను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారతీయత, నిఖార్సైన విలువలను విద్యావ్యవస్థ ద్వారా తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశవ్యాప్తంగా 24వేలకు పైగా విద్యాలయాలను విశ్వభారతి సామాజిక సేవ కోణంలో నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. విలువతో కూడిన విద్యను అందిస్తున్న విద్యాభారతికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 400లకుపైగా విద్యాలయాలు నడుస్తున్నాయన్నారు. గిరిజన, సాగర తీర గ్రామాల్లో వేల సంఖ్యలో ఏకల్ విద్యాలయాలు స్వచ్ఛంద సేవను అందిస్తున్నాయని తెలిపారు. ప్రముఖ విద్యావేత్తలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రాయూనివర్శిటీ మాజీ వీసీ జి.నాగేశ్వరరావు, ఉస్మానియా యూనివర్శిటీ మాజీ వీసీ తిరుపతిరావు, కర్ణాటక యూనివర్శిటీ మాజీ వీసీ పరమేశ్వరహెగ్డేలు అధ్యక్షతవహించారు.

శభాష్.. పోలీస్!

(3వ పేజీ తరువాయి)

తెలిపారు. ఎస్ఐ అంకమరావు, కానిస్టేబుళ్లు రంగనాయకులు, కాశీరావు, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించారు.

ఆత్మహత్యకు యత్నిస్తున్న మహిళను రక్షించిన పోలీసులు

కంభం : కంభం రైల్వే స్టేషన్ సమీపంలో ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నిస్తుందన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆమెను రక్షించారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం మేరకు.. కంభం పట్టణం మేదరవీధికి చెందిన లాలమ్మ కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలవైపు వెళ్లింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన పోలీసులు మహిళను గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీపీఐ మహాసభల ర్యాలీకి సీపీఎం ఘన స్వాగతం

ఒంగోలు(రూరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలని కాంక్షిస్తూ వారి ర్యాలీకి సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. శనివారం స్థానిక నెల్లూరు బస్టాండ్ నుంచి సీపీఐ జాతీయకార్యదర్శి కెనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో ప్రారంభమైన ర్యాలీకి సాగర్‌హోటల్ వద్ద సీపీఎం నాయకులు పూలతో, కరచాలనం చేసి ఘన స్వాగతం పలికి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, కార్యవర్గసభ్యులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్, చీకటి శ్రీనివాసరావు, పమిడి వెంకటరావు, కాలం సుబ్బారావు, జి.రమేష్, పి.వెంకటరావు, రఘురామ్, వి.బాలకోటయ్య, కంకణాల రమాదేవి, పి.కల్పన, దామా శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బి.మునలారెడ్డి, శ్రీధర్, వీరాస్వామి, మోజెస్, ఎం.వెంకటరావు, జి.ఆదిలక్ష్మి, కె.వెంకటేశ్వర్లు, భక్తసింగ్‌రాజు, మారెళ్ల సుబ్బారావు, గురుస్వామి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాచర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజలు సందర్భంగా ఆలయంలోని పలు సత్రాలలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిబిరం

గిద్దలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు ఒంగోలు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరానికి 6 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల దివ్యాంగ విద్యార్థులు రావాలని పేర్కొన్నారు. ఆధార్, ఫొటో, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు 2 సెట్లు తీసుకురావాలని, స్పెషలిస్టు డాక్టర్లతో వైకల్యాన్ని నిర్ధారణ చేసి అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, వీల్‌చైర్, 3 చక్రాల సైకిల్, సంక కర్రలు, అంధులకు వాకింగ్ స్టిక్, సీపీ చైర్ లాంటివి అందజేస్తామని, ఈ అవకాశాన్ని దివ్యాంగ విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న న్యాయాధికారి భరత్ చంద్ర



చెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న జడ్జి భరత్ చంద్ర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని గిద్దలూరు న్యాయాధికారి భరత్ చంద్ర శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి చెన్నకేశవస్వామి మూలవిరాట్ విశిష్టత, ఆలయ విశిష్టత, శిల్పకళ, అలనాటి రాజుల శాసనాలు వివరించారు.

కంభం మండలంలో చిరుత జాడ లేదు

● బేస్తవారపేట రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఆనందరావు

కంభం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం ఎల్‌కోట, నడింపల్లి, ఔరంగాబాద్, లింగోజిపల్లి గ్రామ పంటపొలాల్లో చిరుత పులి జాడలు ఏమీ లేవని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని బేస్తవారపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు శనివారం తెలిపారు. ఈనెల 20వ తేదీ ఎల్‌కోట, లింగోజిపల్లి గ్రామ పంటపొలంలో చిరుత పులి పాదముద్రలు ఉన్నాయని, ఆ గ్రామ ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు ఆయా గ్రామ పొలాలలో ముఖ్యమైన ప్రాంతాలలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం తాము వెళ్లి ట్రాప్ కెమెరాలను పరిశీలించగా ఎటువంటి జంతువుల జాడ లేదని తెలిపారు. అయినా మరికొన్ని రోజులు గమనిస్తామని ఆనందరావు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



ఎర్రగొండపాలెంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచినపుడే అంటువ్యాధులు వ్యాప్తి చెందవని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం పడమరవీధిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం పారిశుధ్యకార్మికులతో కలిసి ఎరిక్షన్‌బాబు రోడ్డుపై ఉన్నబురదను తొలగించారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడరు చల్లించారు. ఇంటి సరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసారావు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి పి. రామసుబ్బయ్య, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

● 3.7 కేజీల సరుకు సీజ్

సింగరాయకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రైల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని జిల్లా టాస్క్‌ఫోర్స్, జీఆర్పీ పోలీసులు శనివారం సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేశారు. నిందితుడు నుంచి 3.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు జీఆర్పీ ఎస్సై మధుసూదన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా యడమారి మండలం కుప్పూరి గ్రామానికి చెందిన కెపీ వీరప్పన్ ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి కొనుగోలు చేసి పూరీ- తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో స్వగ్రామానికి తీసుకెళ్తున్నాడు. రాబడిన సమాచారం మేరకు ఎస్పీ ఏఆర్ దామోదర్ టాస్‌ఫోర్స్ జీఆర్పీ పోలీసులు అప్రమత్తం చేశారు. వీరు బృందాలుగా విడిపోయి ఒంగోలు రైల్వేస్టేషన్‌లో పూరీ ఎక్స్‌ప్రెస్ ఎక్కి తనిఖీలు ప్రారంభించారు. రైలు సింగరాయకొండ రైల్వేస్టేషన్‌కి వచ్చేసారికి జనరల్ బోగీలో గంజాయి తరలిస్తున్న వీరప్పన్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒంగోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పాము కాటుకు గురై సర్పంచ్ మృతి


ఆదిలక్ష్మి (ఫైల్)

ముండ్లమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి(33) శనివారం ఉదయం పాము కాటుకు గురై మృతి చెందారు. ముండ్లమూరు పంచాయతీలోని స్వగ్రామమైన వేంపాడులో పొలం పనులకు వెళ్లి పాము కాటుకు గురైంది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. దీంతో ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సర్పంచ్ ఆదిలక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో గెలుపొందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వేంపాడు వెళ్లి సర్పంచ్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె భర్త గురవయ్యను పరామర్శించారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, బ్రహ్మేశ్వరరావు, గంగినేని శేషగిరిరావు, మేదరమెట్ల కొండలరావు ఉన్నారు. ఎంపీడీవో ఎం.శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్... ఆదిలక్ష్మి మృతదేహానికి నివాళులర్పించారు.

సబ్ జైలును పరిశీలించిన డీఐజీ

దర్శి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాదరావు శనివారం దర్శి సబ్ జైలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, నిబంధనల ప్రకారం మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంతకముందు దర్శి-అద్దంకి రోడ్డులో నూతన సబ్‌జైలు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌జేవో పి.వరుణ్‌రెడ్డి, దర్శి సబ్ జైలు సూపరింటెండెంట్ పీవీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

- తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి


విద్యార్థినులతో మాట్లాడుతున్న కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డైరెక్టర్ దేవానందరెడ్డి

ముండ్లమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు కష్టపడి చదివినట్లయితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, తల్లిదండ్రులు పెట్టుకున్న కలలు సాకారం చేయాలంటే కిందిస్థాయి తరగతుల నుంచి బాగా చదవాలని రాష్ట్ర కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రమైన ముండ్లమూరులోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ముందుగా విద్యార్థినులు చదువుతున్న తరగతి గదులకు వెళ్లి వారిలో ఉన్న నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం వంటసాల, తాగు నీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. చక్కగా సమాధానాలు రావటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు రుచికరంగా వండాలని కుగింగ్ నిర్వాహకులకు సూచించారు. గత ఏడాది మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం బాగా ఉండటంతో ప్రిన్సిపల్ ఆవుల సునీతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాల పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆవరణను చూసి విద్యార్థులకు మంచి వాతావరణం కలిగించి వారికి సౌకర్యాలు కల్పించటం పట్ల కూడా సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తనను దూరం పెడుతోందని మనస్థాపంతో ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పుగుండూరులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన మల్లాల శ్రీను (53)కు ఉప్పుగుండూరులోని హైస్కూల్ కాలనీలో ఒంటరిగా ఉంటున్న మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమెతో శ్రీను సహజీవనం చేస్తున్నాడు. కొంతకాలం నుంచి ఆ మహిళ శ్రీనును దూరం పెడుతుందని గ్రహించి మనస్థాపానికి గురై శనివారం మహిళ నివశించే రేకుల ఇంట్లోని ఇనుప గడ్డర్‌కు చీరతో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

ఉప్పుగుండూరు అభ్యర్థికి డీఎస్సీలో రెండో ర్యాంకు

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పుల్లా బ్లెస్సీజాయ్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంక్, జోనల్‌స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించింది. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాస్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. బ్లెస్సీజాయ్ తల్లి సుచరిత ఒమ్మెవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, తండ్రి ముత్యాలయ్య ఒంగోలులోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వారి ప్రోత్సాహంతో గతంలో పీజీసెట్‌లో 89 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. కర్నాటక రాష్ట్రంలోని మైసూర్‌లో బ్లెస్సీజాయ్ బీఏ, బీఈడీ పూర్తి చేసింది.

ఉత్సాహంగా సౌత్ జోన్ తైక్వాండో పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని కమలా హైస్కూల్‌లో సీబీఎస్ఈ సౌత్ జౌన్ తైక్వాండ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అండర్-14, 17, 19 కేటగిరిలలో విద్యార్థులకు తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ తదితర రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. రేపు కూడా పోటీలు జరుగుతాయని విద్యాసంస్థల చైర్మన్ పవన్ తెలిపారు.






నిషేధం ఒట్టిమాటే!

మార్కాపురంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల విక్రయం
మంత్రి, కలెక్టర్ హెచ్చరించినా మారని వైనం

మార్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ప్లాస్టిక్ వస్తువుల వలన కలుగుతున్న హాని అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ భూతాన్ని సమాజం నుంచి తరిమికొట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్‌ను ఏ విధంగా తరిమికొట్టాలో నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో అవగాహన ర్యాలీలు, స్టాల్స్ ప్రదర్శన, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా గత నెల 19వ తేదీన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజాప్రతినిధులు తదితరులు మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో తనిఖీలు కూడా చేపట్టారు. ప్రధానంగా ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, ప్రత్యామ్నాయాలు ఉపయోగించాలని సూచించారు. సరిగా నెలకూడా కాలేదు. మార్కాపురంలో మళ్లీ ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా మారింది. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేది మున్సిపల్ యంత్రాంగం. ఆ మున్సిపాలిటీ కార్యాలయం చుట్టే కూరగాయాల మార్కెట్, చిల్లర దుకాణాలు, పండ్ల వ్యాపారులు ఉంటారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోనే ఇష్టారీతిన ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు వాడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో యథేచ్ఛగా ప్లాస్టిక్‌ను ప్రజలకు అంటగడుతూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

ప్రకాశం పంతులును స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి డాక్టర్ స్వామి పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పిలుపునిచ్చారు. ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్‌లోని ప్రకాశం పంతులు విగ్రహానికి శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు మునిమనమడు సంతోష్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం ఏబీఎం కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పింగళి పాండురంగారావు రచించిన 'జాతీయస్థాయిధీరుడు టంగుటూరి ప్రకాశం' పుస్తకాన్ని మంత్రి స్వామి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో తనదైన ముద్ర వేసిన ధీరుడు ప్రకాశంపంతులు అని అన్నారు. న్యాయవాదిగా ఎంతో ప్రాక్టీసు ఉన్నా స్వాతంత్ర్యపోరాటం కోసం త్యాగంచేసిన వ్యక్తిఅని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి చిన ఒబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల అధికారులు జోసెఫ్‌కుమార్, డాక్టర్‌వెంకటేశ్వర్లు, సుశీల, పద్మశ్రీ, నారాయణ, వెంకటేశ్వరరావు, ఒంగోలు తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలి : జేసీ

ఒంగోలు (రూరల్) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పౌరుషం, త్యాగం, ప్రతిభకు ప్రతీకగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలని, దేశభక్తికి చిహ్నంగా దేవరంపాడు ఉప్పుసత్యాగ్రహ విజయ స్థూపం ప్రాంతాన్ని అభివృద్ధి పరుస్తామని జేసీ ఆర్.గోపాలకృష్ణ స్పష్టం చేశారు. ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామం వద్ద గల ఉప్పుసత్యాగ్రహ విజయ స్థూపం వద్ద ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. విజయ స్థూపం వద్ద జాతీయ జెండాను గోపాలకృష్ణ ఆవిష్కరించి జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. జేసీ మాట్లాడుతూ ఎన్నో సవాళ్లను ఎదురొడ్డి ముందుగు సాగిన ప్రకాశం పంతులును యువత ఆదర్శంగా తీసుకొని ఎంచుకున్న రంగంలో ముందుకు పోవాలన్నారు. ఉప్పు సత్యాగ్రహ విజయ స్థూపం వద్ద 2 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద పల్లెవనం ద్వారా రూ.10లక్షలతో ఉద్యానవనం అభివృద్ధి చేయిస్తానన్నారు. 3 నుంచి 5 నెలల్లో పూర్తిచేయిస్తానన్నారు. ఉప్పుసత్యాగ్రహ ప్రాంగణం 4 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.10 లక్షలు నిధులు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. దేవరంపాడు గ్రామం నుంచి ఉప్పుసత్యాగ్రహ విజయ స్థూపం వరకు రెండున్నర కిలోమీటర్లు దూరం ఉంటుందని, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా రూ.75లక్షలతో రోడ్డును అభివృద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఆ బిల్లులు రావటానికి ఆరేడు నెలలు సమయం పడుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు గ్రామసర్పంచ్ ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్, డీపీవో జి.వెంకటనాయుడు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఉపాధి హామీ పథకం పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీవో, కె.రాజశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

లక్ష్యం చేరడానికి కృషి చేయాలి

- జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని పెట్టుకుని దానికి చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దంతెరపల్లి గ్రామంలోని సెయింట్‌జాన్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు , సంజీవరాయునిపేట సచివాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న న్యాయాధికారి ఓంకార్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంజీవరాయునిపేట సచివాలయంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీలు జరుగకుండా నిరోధక చట్టం గురించి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్, ఉచిత న్యాయ సహాయం, పట్టాదారు పాస్ పుస్తకాల గురించి, సివిల్ హక్కులకు చెందిన పలు చట్టాల గురించి ఆయన తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన న్యాయాధికారి

మండలంలోని ముండ్లపాడు గంజి వీరభద్రయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌ను శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ భవనం మరమ్మతులు పూర్తి కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పూర్తిస్థాయి హాస్టల్ భవనం అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే మండల న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని లేదా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వార్డెన్ ఆంజనేయులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో ఎర్ర చీరలు, ఎర్ర గొడుగులతో మహిళలు


కవాతులో అగ్ర భాగాన సీపీఐ జాతీయ, రాష్ట్ర నేతలు


గిరిజన జనపదాలతో కళాకారుల ఆటాపాట


సభలో మాట్లాడుతున్న నారాయణ

నగరం ఎరుపెక్కింది!


కమ్యూనిస్టు సింబల్‌తో చిన్నారి

నగరం ఎర్రబారింది. పాదం కదుపుతూ.. పదం పాడుతూ.. ఎర్రసైన్యం దండుగా కదలింది. ప్రధానవీధుల్లో క్రమశిక్షణతో కూడిన కవాతుతో కదంతొక్కింది. ముందు పీలిన కాళాకారులు విన్యాసాలతో.. వారి వెనుక అగ్రనేతల ప్రదర్శనతో.. ఆ వెనుక మహిళలు ఎర్ర చీరలు ధరించి.. ఎర్ర గొడుగులు చేపట్టి సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. రోడ్లన్నీ ఎర్రపతాకాలతో నిండిపోయాయి. మతసామరస్యాన్ని చాటుతూ చిన్నారులు అలంకరణ ఆకర్షణగా నిలిచింది. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా శనివారం ఒంగోలులో కనిపించిన దృశ్యాలివి. సాయంత్రం కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో బహిరంగ సభ జరిగింది. ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలతోపాటు సినీనటుడు మాదాల రవి పాల్గొన్నారు.

బ్రిటీషర్ల తుపాకీలకు గుండె చూపిన ధీరశాలి 'ప్రకాశం'

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- టంగుటూరి ఆశయాలను కొనసాగించాలని పిలుపు
- ఘనంగా ఆంధ్రకేసరి జయంతి వేడుకలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో బ్రిటీష్ తుపాకీగుళ్ళకు గుండె ఎదురుచూపిన ధీరశాలి టంగుటూరి ప్రకాశంపంతులు అని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జన్మస్థలమైన వినోద రాయునిపాలెంలోని జడ్పీ హైస్కూలులో ఆయన 154వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రకాశంపంతులు వారాలు చేసుకుంటూ చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆయన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేయడం గర్వకారణమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. లండన్‌లో బారిష్టర్ చదువుకుని స్వదేశానికి తిరిగివచ్చి మద్రాసు ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారని, లాభదాయకమైన తన వృత్తిని వదిలి ప్రజాజీవితానికే అంకితమయిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నేటి యువత ప్రకాశంపంతులును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. తొలుత ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి .ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బీఎన్‌బహుమతులు ప్రదానం చేశారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డిప్యూటీ డీఈవో చంద్రమౌళి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంఈవోలు టి.రవి, రమణయ్య, సర్పంచ్ ఘట్టమనేని అశోక్, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఈదర నాని, తెలగతోటి జాన్సన్, కొంజేటి ధనుష్, పల్లపోతు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశంపంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు, నాయకులు

ఒంగోలు నగరంలో..

ఒంగోలు విద్య: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలు శనివారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ భారతీదేవి, జి.రాజమోహన్, సోమశేఖర్, కేవీఎస్.రాజు, ఎం.హర్షప్రీతమ్ పాల్గొన్నారు.

- స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రకాశంపంతులు జయంతిని పురస్కరించుకుని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.సుధారాణి, యామిని అమ్మాజీ పాల్గొన్నారు.

- ఒంగోలు కలెక్టరేట్: ప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, వైఎం.ప్రసాదరెడ్డి, ప్రసన్న, రాజీవ్, నారాజు, అమర్, పి.సురేష్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

- లాయర్‌పేటలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజాశంకర్‌శాండిల్య ఆధ్వర్యంలో ప్రకాశంపంతులు విగ్రహానికి నగర కమిషనర్ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీవీ.శ్రీరామమూర్తి, కె.కుసుమకుమారి, రాజేష్, ధేనువుకొండ సుబ్బయ్య, రామారావు, జీఎస్ఆర్, కత్తుల శివశంకర్, మారుతి, ఎం.వాసు, వంశీ పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా గ్రంథాలయంలో ప్రకాశంపంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. నగర అభివృద్ధి సమితి అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.మస్తాన్‌రావు, యాక్సిస్ బ్యాంకు క్లస్టర్ మేనేజర్ బెజవాడ పావని, సంపూర్ణ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలను చీమకుర్తిలో ప్రకాశంపంతులు సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిపారు. ప్రకాశం పంతులు విగ్రహనికి సీఐ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి పాటిమీదపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ రమేష్‌బాబు, డాక్టర్ రాహుల్, చీమకుర్తి కమలమోహనరావు, చదలపాక ప్రసాదరావు, సీతాపతిరావు, ఏడుకొండలు, కిలారి ఆంజనేయులు, లోకయ్య, ఎస్‌కే.సిలార్‌సాహెబ్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీఐ సుబ్బారావు

సంతనూతలపాడులో..


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సంతనూతలపాడు: స్వాతంత్రసమరయోధుడు టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలను శనివారం సంతనూతలపాడు గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.సత్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలోను ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు

- ఎస్పీ దామోదర్


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో విద్యార్థుల భద్రత, క్రమశిక్షణపై కళాశాల యజమానులు, తల్లిదండ్రులు, వార్డెన్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళాశాలల్లో యాజమాన్యం కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా విద్యార్థుల నడవడిక పట్ల కూడా తనగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు యజమాన్యం చర్యలు తీసుకోవాలని చెప్పారు. కళాశాలలో మహిళల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు రాఘవేంద్ర, దేవప్రభాకర్, విజయకృష్ణ, ఎన్.శ్రీకాంత్‌బాబు, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం


సాంబశివరావును సన్మానిస్తున్న నాయకులు

పొన్నలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పొన్నలూరు మండల అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన అనుమోలు సాంబశివరావును మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు కర్నా కోటిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మండవప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, నన్నమూరి నరసింహ, కాటూరి మాధవరావు, షేక్ చిన్నమస్తాన్, రమణయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు అభినందన


చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న నాయకులు

టంగుటూరు (కొండపి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ టంగుటూరు మండల అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్‌ను ఆ మండల నాయకులు అభినందించారు. సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, బెల్లం జయంత్‌బాబు, పార్టీ మాజీ అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, పలు గ్రామాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం : చైర్మన్

సింగరాయకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వినియోగదారుల అదాలత్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. శనివారం మూలగుంటపాడు కాకతీయ కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, అవసరమైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ సదస్సులో వినియోగదారుల నుంచి 17 అర్జీలు రాగా అందులో వెంటనే 14 పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌సీహెచ్ శ్రీనివాసులు, ఎ.సునీత పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సింగరాయకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శనివారం జిల్లా లెప్రసీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థినిలు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం చదువుతున్న వి.గౌతమి, జి. మహేశ్వరి ద్వితీయ బహుమతిని గెలుచుకోగా ప్రిన్సిపాల్ సౌజన్య అభినందించారు.

నవధాన్యాలతో అధిక దిగుబడులు

కొత్తపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెట్ట వరిసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు నవ ధాన్యాలను చల్లాలని ఏవో జి.కిషోర్‌బాబు అన్నారు. శనివారం అల్లూరులో రైతులు సాగు చేస్తున్న మెట్ట వరి సాగు పద్ధతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్నంగి కోటిరెడ్డి పొలంలో సాగు చేస్తున్న మెట్ట వరి సాగులో పిల్లిపెసర, పెసర, ఉలవలు, అలసందలు, మినుములు, తోటకూర, గోంగూర విత్తనాలను చల్లారు. ఇలా చేయటం వల్ల వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని, మొక్కకు కావల్సిన పోషకాలు సక్రమంగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారుల పీజీ కోటాను కొనసాగించాలి

- ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీసు డాక్టర్ పీజీకోటాను 20శాతం కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాటమాల రాహుల్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ డాక్టర్ పీజీ కోటాను 20శాతం నుంచి 15శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. కేవలం ఏడు శాఖల్లో సర్వీసు కోటా కాకుండా గతంలో మాదిరిగా అన్ని శాఖల్లో సర్వీసు కోటా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ సర్వీస్‌కోటా తగ్గించే విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుందర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇన్‌సర్వీసు వైద్యాధికారుల కోటాను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నబీవలి, డాక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైద్యులు

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

- రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో శనివారం అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులు కూటమికి ఓట్లువేసి గెలిపించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఇంత వరకు బాధితుల గోడు పట్టించుకోలేదని ఆరోపించారు. అగ్రిగోల్డ్ కంపెనీ పనిచేస్తున్న సమయంలో రియల్‌ఎస్టేట్ ప్లాట్లను, ఫామ్ ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితుల భూములను ప్రభుత్వం వెంటనే అటాచ్‌మెంట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసిన బాధితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అగ్రిగోల్డ్ అస్తులను ఆర్డర్ సంస్థ ద్వారా విలువలు లెక్కించానపి. సంస్థ భూములను వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీ.నాయుడు, ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.హనుమారెడ్డి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు, అగ్రిగోల్డ్ బాధితులు మాణిక్యాలరావు, శేషుకుమార్‌రెడ్డి, రాంబాబు, నాగలక్ష్మి, నాయక్, సుబ్బారావు, రామదాసు, ఖాదర్, శంకరయ్య, భద్రం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎమ్మెల్యే బీఎన్
- ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం వినోదరాయునిపాలెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. గ్రామంలోని సైడు కాలువలను పరిశీలించి మురుగునీరు ప్రవహించేలా పూడికతీత పనులు చేపట్టాలని, ప్రతిరోజు చెత్తసేకరణ జరిగేలా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, భూతాపాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం మహిళలకు తడి, పొడి చెత్త సేకరించేందుకు డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మురళీ, వెంకటేశ్వర్లు, టీడీపీ మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తెలగతోటి జాన్సన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకట కృష్ణారావు, ఏడుగుండ్ల వెంకటేశ్వరావు, ఏఎంసీ డైరెక్టర్ కొంజేటి ధనుష్, నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిభవన్‌లో..

ఒంగోలు నగరం: ఒంగోలులోని ప్రగతిభవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం సిబ్బంది శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాన్ని శుభ్రం చేయటంతో పాటు పరిసరాల చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాలపాడులో..

పొన్నలూరు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత కోరారు. శనివారం మాలపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయని, వేరు చేసి వారికి ఇవ్వాలని తెలిపారు. అనంతరం చెంచుపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, నామకులు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు కార్పొరేషన్ : స్వచ్ఛాంధ్రలో భాగంగా కార్పొరేషన్ అధికారులు శనివారం నగరంలోని పలు డివిజన్లలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మురుగునీటి పారుదల మెరుగు కోసం చేపట్టిన పనులను పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

ఒంగోలు నగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగుల్లో అర్హులైన వారి పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని జాతీయ విభిన్నప్రతిభావంతుల హక్కుల సాధన ట్రస్టు చైర్‌పర్సన్ ఎం.సులోచనరాణి డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ట్రస్టు కార్యాలయం వద్ద జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చిందని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని శాశ్వత ఉద్యోగిగా చూపించి.. ఇలా అనేక కుంటి సాకులతో 95వేల మంది దివ్యాంగుల పింఛన్లను రద్దు చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్ పేరుతో రద్దు చేయబోతుందన్నారు. ప్రభుత్వం అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. నేడు బోగస్ అంటూ రద్దు చేస్తున్న పింఛన్లు మంజూరు కావటానికి సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో మదర్‌తెరిసా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ అమీర్, పుసుమర్తి రాజేష్, సలోమి, లక్ష్మయ్య, శేషయ్య, గుల్జార్ తదితరులు పాల్గొన్నారు.

పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు

ఒంగోలు క్రైం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఈగల్ టీం పూరి ఎక్స్‌ప్రెస్‌ను విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా నాలుగు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుంది. ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు సంయుక్తంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ళలో తనిఖీలు నిర్వహించారు. పూరి ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి ఎక్కడ నుంచి తరలిస్తున్నారనే విషయంపై ముగ్గురు అనుమానితులను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చెంచయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కమిటీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక గుంటూరు రోడ్డులోని పీఏజీ కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజవర్గ కమిటీ పరిశీలకులు గుమ్మడి సంధ్యారాణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కనపర్తి శ్రీనివాస్ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, నియోజకవర్గపరిశీలకులు, రాష్ట్ర, జిల్లా నామినెట్ చైర్మన్లతో పాటు ముఖ్యనాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డీఎస్సీలో శ్రీవికాస్ విద్యార్థుల ప్రతిభ


అంజనిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. స్కూలు అసిస్టెంట్ గణితంలో తిమ్మసముద్రం గ్రామానికి చెందిన జి.అంజని 93.013మార్కులతో మొదటి ర్యాంకుతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. ఎస్‌జీటీ విభాగంలో కరవదికి చెందిన ఐ.మౌనిక 89.8 మార్కులతో 11వ ర్యాంకు, ఎస్ఏ బయాలాజికల్‌లో పొదిలికి చెందిన స్వాతిక 83.67 మార్కులతో 5వ ర్యాంకు, గణితం విభాగంలో దైవాలరావూరుకు చెందిన అరుణ ప్రసాద్ 83.77 మార్కులతో పదో ర్యాంకు సాధించారు. మరికొందరు కూడా డీఎస్సీలో మంచిమార్కులు సాధించి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్థానిక కోచింగ్ సెంటర్‌లో శనివారం కరస్పాండెంట్ కెమోహన్‌రావు, డైరెక్టర్ వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్‌జీటీ పోస్టులకు ముగ్గురు ఎంపిక

మద్దిపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ పోస్టులకు మండలానికి చెందిన ముగ్గురు ఎంపికైనట్లు అధికారులు శనివారం తెలిపారు. మద్దిపాడు అరుంధతినగర్‌కు చెందిన పి.పావని, బి.నాగశిరీష, గుండ్లాపల్లికి చెందిన జి.రాణిలు ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

సాయిబాబా విద్యార్థుల సైకిల్‌యాత్ర


సైకిల్‌యాత్ర చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను చాటిచెప్తూ ఒంగోలు లోని సాయిబాబాసెంట్రల్ స్కూలులో 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు శనివారం సైకిల్ యాత్రను నిర్వహించారు. ఉపాధ్యాయులు సుదర్శన్, సుమన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు సైక్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సైక్లింగ్ ప్రాముఖ్యత, ప్రయోజనాలు, వాహనాల కాలుష్యాన్ని తగ్గించడంలో దానిపాత్ర వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.భాస్కర్, ప్రిన్సిపాల్ శశిలక్ష్మి విద్యార్థులను అభినందించారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. సోమవరం ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాలులో ఒడా చైర్మన్ షేక్ రియాజ్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు మార్కాపురం వ్యవసాయమార్కెట్‌లో ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన హాజరవుతారు. మంగళవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

'ఒంగోలు తాలూకా సర్వస్వం' పుస్తకావిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం పంతులు సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధులు గుండ్లాపల్లి ఆదినారాయణపంతులు షష్టిపూర్తి మహోత్సవ సంచిక నుంచి యధాతథంగా స్వీకరించిన ఒంగోలు తాలూకా సరస్వం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఒంగోలులోని పీవీఆర్ స్కూలులో జరుగుతున్న పుస్తక మహోత్సంలో మాదాలరంగారావు కళావేదికలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. రచయిత రామచంద్రుని వెంకటప్ప ఈ పుస్తకంలో ఒంగోలుకు సంబంధించిన అన్ని విషయలను, వ్యక్తులపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి గుండ్లాపల్లి కృష్ణయ్య, పోనూరి వెంకట శ్రీనివాసులు, ధేనువుకొండ సుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య, ఉప్పలపాటి వెంకటరత్నం, వీవీ.నరసింహారెడ్డి, సంపత్‌కుమార్, రిటైర్డ్ రిజిస్ట్రార్ జి.మురళీకృష్ణ, భైరపునేని సూర్యనారాయణ పాల్గొన్నారు.

128 మందికి వైద్య సేవలు

మద్దిపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడులో శనివారం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 128 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులోని గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు బాలల హక్కులపై జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, కుమారి, అనిత, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్లు

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ డాక్టర్‌ల పీజీ కోటాను 20 శాతాన్ని యథావిధిగా కొనసాగించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి.వెంకటేశ్వర్లుకు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాటమాల రాహుల్ శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్‌ల పీజీ కోటాను 20 నుంచి 15 శాతాన్ని తగ్గించటం సరికాదన్నారు. కేవలం 7 శాఖలలో సర్వీస్ కోటా కాకుండా గతంలో మాదిరిగా అన్ని శాఖలలో సర్వీస్ కోటా అమలు అయ్యేలా చూడాలని, గత ఏడాది ఇచ్చిన హామీలు అమలు పర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్ మస్తాన్ బీ, డాక్టర్ సుందర్ ప్రసాద్, డాక్టర్ నబీ వలి, కుమారస్వామి పాల్గొన్నారు.


ఎంపీడీవోకు అభినందనలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

ఎంపీడీవో సేవలు అభినందనీయం

రాచర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలకు ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని రాచర్ల సొసైటీ బ్యాంకు ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి అన్నారు. మండల ప్రజలకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ ఎంపీడీవోగా మంత్రి, కలెక్టర్, జడ్పీ సీఈవో నుంచి ఉత్తమ ఎంపీడీవో అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తాము కూడా ఆయనను అభినందిస్తున్నామని అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వారు ఆయనను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమవరపు ఆరోగ్యం, చిట్టెం భాస్కర్, తలపాటి సుధాకర్, చిట్టెం జీవరత్నంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు సంక్షేమ పథకాలు సమకూరుస్తున్నదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల స్క్రీనింగ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల కోసం భవిత స్పీచ్ థెరపి, ప్రత్యేక బోధనల ద్వారా బోధన అందిస్తుందని, వివిధ రకాల ఉపకార వేతనం కూడా అందిస్తుందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో వైద్యులు విద్యార్థుల వైఫల్యాలను గుర్తించి వారికి అవసరమైన ట్రైసైకిల్స్, బ్రైలీ కిట్స్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు రామ్‌దాస్ నాయక్, శార్వాణి, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

● శాంతి సంఘ సమావేశంలో డీఎస్పీ నాగరాజు

కంభం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినాన్ని, మరుసటి రోజు జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మార్కాపురం డీఎస్పీ యు. నాగరాజు తెలిపారు. శనివారం కంభం పోలీస్ స్టేషన్ ఆవరణలో కంభం సీఐ మల్లిఖార్జున అధ్యక్షతన ఏర్పాటు చేసిన శాంతి సంఘ (పీస్ కమిటీ) సమావేశంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనం సంతోషంగా చేసుకునే ఏ పండుగలు అయినా ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. మండపాలలో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్న తర్వాత భక్తి పాటలతోపాటు రాత్రి వేళ మండపాల వద్ద విగ్రహ కమిటీ సభ్యులే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో చెరువు కట్టకు వెళ్లే వాహనాలు, భక్తులు, విగ్రహ కమిటీ వారు తొక్కిసలాట లేకుండా క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సీఐ మల్లిఖార్జున మాట్లాడుతూ పండుగలను మతసామరస్యానికి ప్రతీకగా ప్రతిఒక్కరూ కలిసిమెలిసి చేసుకోవాలన్నారు. కంభం చెరువు కట్టపై వినాయక నిమజ్జన సమయంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా తాము ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్లతో నిమజ్జనం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కంభం తహసీల్దార్ కిరణ్, ఎస్సై నరసింహారావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొని మాట్లాడారు.

ఆక్రమణలు.. ఆపై అద్దెల దందాలు..!

కంభంలో ప్రభుత్వ ఆస్తులపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం
వేలాది రూపాయల వసూలు
చోద్యం చూస్తున్న పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు


జాతీయ రహదారిపై డ్రైనేజీని ఆక్రమించుకొని ఏర్పాటు చేసిన షాపులు

కంభం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలోని మేజర్ పంచాయతీలు అయిన కంభం, కందులాపురంలలో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. పలువురు ప్రభుత్వ స్థలాలను ఇష్టారీతిన ఆక్రమించుకొని పక్కాగా షెడ్లు, బంకులు, రూములు నిర్మించి చిరు వ్యాపారులకు వేల రూపాయలకు అద్దెకు ఇస్తున్నారు. ఈ అద్దెల దందా విషయం అధికారులకు తెలిసినప్పటికీ నెలసరి మామూళ్లు తీసుకుంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కందులాపురం సెంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు, ప్రహరీగోడ వెంట, కళాశాల ఎదురుగా, వై జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, మెయిన్ బజార్, పంచాయతీ రోడ్లు, ఆర్‌అండ్‌బీ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. అక్కడితో ఆగకుండా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని బడ్డీకొట్లు వారికి, టీకొట్లకు, ఇతర వ్యాపారులకు అద్దెలకిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. పంచాయతీ, ఆర్ అండ్‌బీ స్థలాల్లో పంచాయతీ వారే షెడ్లను, బంకులను ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు అద్దెకిస్తే వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేసుకోవచ్చునని వార్డు మెంబర్లు బహిరంగంగా చెబుతున్నారు. అంతే కాకుండా ఆక్రమణదారుల నుంచి నెలసరి మామూళ్లు తీసుకుంటూ వదిలి వేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అద్దెల రూపంలో పంచాయతీలకు రావలసిన లక్షల రూపాయలు ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఉర్దూ పాఠశాలలన్నీ ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. ఒక కళాశాల గేటు తప్ప మిగిలిన ప్రాంతం మొత్తం ఆక్రమించుకొని బంకులు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన దుకాణాలన్నింటిపై సర్వే నిర్వహించి పంచాయతీ వేలం ప్రక్రియ నిర్వహిస్తే వాటికి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు ఆదాయం పెంచే విధంగా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యదర్శి వివరణ

ఈ విషయమై కందులాపురం కార్యదర్శి జోష్యులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కళాశాల గోడల వెంట ఉండే షాపులకు అద్దెలు వసూలు చేస్తున్నామని, మిగిలిన ప్రాంతాలలో ఉన్న ఆక్రమణలు పరిశీలిస్తామని తెలిపారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడ పక్కన ఏర్పాటు చేసిన బంకులు


కళాశాల ఎదురుగా పంచాయతీ స్థలాల్లో వెలసిన కొట్లు

తెలుగువారి ఆత్మస్థైర్యానికి నిలువుటద్దం ప్రకాశం పంతులు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి
ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మస్థైర్యానికి నిలువుటద్దంలా నిలిచిన నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని, దేశ స్వాతంత్ర్యం కోసం సమస్తం త్యాగం చేసిన దేశభక్తుడని ఆయన కొనియాడారు.

పట్టణంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వచ్ఛాంధ్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతినెలా 3వ శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించరు. ర్యాలీలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు ఛైర్మన్ బైలడుగు బాలయ్య, కమిషనర్ ఇ.వి.రమణబాబు, తహసీల్దార్ అంజనేయరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, కౌన్సిలర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

మార్కాపురం వన్‌టౌన్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి స్థానిక వాసవి విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రంగయ్య ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. జాతి గర్వించదగ తెలుగుబిడ్డ ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జీసీడీవో హేమలత

కేజీబీవోల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి

జీసీడీవో హేమలత

పెద్దారవీడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని జీసీడీవో హేమలత అన్నారు. పెద్దారవీడులోని కేజీబీవీని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ముఖ్యంగా ఆరోగ్య, పారిశుధ్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ గురించి ఆరాతీశారు. పాఠశాల రికార్డులను, వస్తు సామగ్రి నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీసీడీవో హేమలత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసులు, శింగంపల్లి సుబ్రమణ్యం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెను ప్రకారం భోజనం ఇవ్వాలి

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు కస్తూర్బా పాఠశాలను జీసీడీవో హేమలత శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెడుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల టాయిలెట్లు, పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈమేరకు సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈమె వెంట ప్రిన్సిపల్ మారుతీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు

త్రిపురాంతకం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వరిపంటలో మేలైన యాజమాన్య పద్ధతులు తెలుసుకుని మంచి ఫలితాలు పొందాలని వ్యవసాయాధికారి బి. సంగమేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మేడపి గ్రామంలో ఆయన వరిపంట సాగు చేస్తున్న రైతుల పొలాల్లో తిరిగి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగులో ప్రధానంగా పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కలుపునివారణ సరైన సమయంలో చేపట్టాలని, ఎరువులు పలు దఫాలుగా విడతల వారీగా ఎప్పుడెప్పుడు వేయాలో వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లాలూనాయక్ పాల్గొన్నారు.

కంది సాగుపై రైతులకు శిక్షణ

కంభం : తురిమెళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలో కంది పంట సాగు చేసిన రైతులను ఎంపిక చేసుకుని వారికి 14వారాలు శిక్షణ ఇస్తామని కంభం మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కంది పంట సాగు చేసిన 30మంది రైతులను ఎంపిక చేసుకుని వారికి 14వారాలు శిక్షణ ఇచ్చి కంది పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు మెలకువలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తురిమెళ్ల గ్రామ వ్యవసాయ సంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలి

కొనకనమిట్ల : ఈపంట సీజన్‌లో పంటలు వేసే ప్రతి రైతు విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు తెలిపారు. మండలంలోని మునగపాడు గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధిచేయడం వలన 30రోజుల వరకు పంటలలో చీడపీడలు ఉంటే రక్షిస్తుందని చెప్పారు. విత్తన శుద్ధి ఎలాచేయాలో రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈకార్యక్రమంలో వీఏఏలు మిడతల శ్రీను, ఎంపీఈవో నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.



వరిలో చేపట్టాల్సిన చర్యలు వివరిస్తున్న వ్యవసాయాధికారి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మార్కాపురం ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శనివారం పరిసరాలు శుభ్రం చేశారు. చేతులు శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో పిచ్చిరెడ్డి, వీఆర్‌వో నాగరాజు, ఏవో కాజా మొహిద్దీన్, ఎఫ్‌బీవోలు రవికుమార్, బాలకుమారి, ధనలక్ష్మి, కల్పన, కాశీం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

తర్లుపాడు : మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలి ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా ఉంచుకోవటంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ పులివేముల రాజు, ఉపాధ్యాయురాలు అలివేలి కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పొదిలి : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు గ్రామంలో శనివారం జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఎంపీడీవో శోభన్‌బాబు పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రజలలో అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలి

● ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సీపీఏపీ టీమ్ సభ్యులకు సూచించారు. శనివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విధివిధానాలు అమలు అయ్యే విధంగా నియోజకవర్గ మండల లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీమ్ ప్రొఫెషనల్ షేక్ మహమ్మద్ ఫాజాన్, సభ్యులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

46 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

● టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపన్నహస్తం అందిస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞత కల్గిఉండాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 46 మందికి మంజూరైన రూ.26.05,928 శనివారం వారి కుటుంబ సభ్యులకు స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా పేదలు ఎవరైనా చికిత్స కోసం సీఎం సహాయనిధి కోరితే వెంటనే నేనున్నానని నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనీయుడన్నారు. అలాగే టీడీపీలో క్రియాశీలక కార్యకర్తలు పెద్దారవీడు మండలం బోడిరెడ్డి గ్రామం గంజినారాయణమ్మకు ప్రమాదబీమా రూ. 5లక్షలు, సానికవరం గ్రామానికి చెందిన ఇడగొట్ల కల్యాణ్‌బాబుకు రూ. 5లక్షలు ప్రమాద బీమా చెక్కులు వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు కాకర్ల కోటయ్య, చిట్యాల వెంగళరెడ్డి, సత్యనారాయణగౌడ్, వేగినాటి శ్రీను, దొడ్డా శేషాద్రి, సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్ వలి, చేదూరి గంగయ్య, పోట్ల గోవింద్, రాములు పాల్గొన్నారు.



దోర్నాల నుంచి ప్రదర్శనగా ఒంగోలుకు వెళతున్న సీపీఐ నాయకులు

సీపీఐ మహాసభలకు తరలిన శ్రేణులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు శనివారం మార్కాపురం పట్టణం నుంచి శనివారం కార్యకర్తలు, కార్మికులు పెద్దఎత్తున బయలుదేరారు. నాయకులు అందె నాసరయ్య, కాశీంల ఆధ్వర్యంలో 35 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

పెద్దదోర్నాల నుంచి..

పెద్దదోర్నాల :ఒంగోలులో ఈనెల 28న నిర్వహించనున్న సీపీఐ మహాసభలకు దోర్నాల నుంచి మండల నాయకులు శనివారం తరలివెళ్లారు.నాయకులు పూర్ణకంటి తిరుమలయ్య, మానే పల్లి విశ్వరూపాచారి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నటరాజ్ ముఠా కార్మికులు, ఏపీఎస్ ఆర్టీసీ ముఠా కార్మికులు, సీపీఐ నాయకులు సభలకు వెళ్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

అర్హతలేని సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

పొదిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అర్హత లేకుండా సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగహక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మదార్‌వలి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హులపేరిట అర్హత లేని దివ్యాంగుల పింఛన్ తొలగించారని, అలాగే వారికి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లపైనా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవగాహనలేని కొంతమంది డాక్టర్ల నిర్వాకం వల్ల అర్హులు కూడా అనర్హులుగా ఉన్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులు కృష్ణ, సయ్యద్ ఆరీఫా, సుభాని. రజాక్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగొండపాలెం తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య తదితరులు

పెన్షన్లను పునరుద్ధరించాలి

● విభిన్న ప్రతిభావంతుల నిరసన

ఎర్రగొండపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రీ అసిస్ మెంట్‌లో తొలగించిన అర్హత ఉన్న వారి పెన్షన్‌లను పునరుద్ధరించాలని శనివారం వికలాంగుల పోరాటసమితి ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులు నిరసన తెలిపారు. పోలియో వ్యాధితో వికలత్వం పొందిన,పుట్టుకతో వికలత్వం పొందిన వారికి సదరం సర్టిఫికెట్‌లో వికలత్వం శాతం తగ్గించిన వారికి రీ వెరిఫికేషన్ చేయాలని కోరుతూ తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పి. పెద్దపాలంకయ్య, కె. కోటేశ్వరరావు, విభిన్నప్రతిభావంతులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

పెద్ద దోర్నాల,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపంతో వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామం ఎస్సీ పాలెంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన వేశపోగు యోహాన్(41)మృతి చెందాడు .కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై మహేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

కంభం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు శనివారం గుంటూరు వైద్యశాలలో మృతిచెందాడు. అర్ధవీడు పోలీసుల కథనం ప్రకారం అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామానికి చెందిన మల్లీశ్వరుడు (22) వ్యాపారం చేసుకునేందుకు డబ్బులు కావాలని కుటుంబ సభ్యులను అడిగాడు. దానికి వారు నిరాకరించారు.దీంతో మనస్తాపానికి గురైన మల్లీశ్వరుడు గతనెల 31వ తేదీన గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు మల్లీశ్వరుడిని గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 23రోజుల తర్వాత శనివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

తాళ్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం కింద చేపడుతున్న ఇంకుడు గుంతలు, కుంటల నిర్మాణాలు, గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసి బిల్లులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ఉద్యాన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జరిగే పనులు త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సత్యం, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజ్, హౌసింగ్ అధికారి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరఫరా

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులకు తగినంత యూరియాను ప్రభుత్వం సరఫరా చేసిందని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వగ్గంపల్లి, దాదిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియాను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.సుబ్బయ్య, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, దాదిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కల్లూరి తినుపతయ్య, బద్దిపూడి మార్కు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలి

తాళ్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో మండపాలు ఏర్పాటుచేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండపాలను ట్రాఫిక్ కూడళ్లు, రహదారులు, ప్రజలు రద్దీగా సంచరించే మార్గాల్లో ఏర్పాటుచేయరాదన్నారు. నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్లు నిర్వహిస్తున్న ఇంటింటి నుంచి చెత్త సేకరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరామయ్య, ఉపసర్పంచ్ సాయి కిరణ్, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇనిమెర్ల గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

ముండ్లమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఈదర, బొప్పూడివారిపాలెం, ఉమా మహేశ్వర అగ్రహారం, కెల్లంపల్లి, ఉల్లగల్లు, వేంపాడు, పోలవరం, శంకరాపురం, మారెళ్ళ గ్రామాలను సందర్శించారు. రౌడీ షీటర్ల ఇళ్ళకు వెళ్ళి వారితో మాట్లాడారు. అనవసరంగా వివాదాల్లోకి తలదూర్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసుస్టేషన్‌కు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపులో అవకతవకలపై కొనసాగుతున్న విచారణ

పామూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపులో అవకతవకలపై రెండోరోజు శనివారం కూడా జిల్లాస్థాయి వెలుగు అధికారులు విచారణ చేశారు. పామూరు క్లస్టర్ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన వీవోఏ పల్లపు బేబి గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.36 లక్షల 75వేలు దుర్వినియోగం చేశారు. దీనిపై విచారణ చేస్తున్నారు. ఈవిచారణపై ఏపీడీ కె.లక్ష్మీరెడ్డిని వివరణ కోరగా ఇప్పుడు తాను ఏమి చెప్పలేనని, విచారణ కొనసాగుతుందన్నారు. ఈవిచారణలో డీపీఎం డి.దానం, జిల్లా స్త్రీనిధి మేనేజర్ ఉదయ్‌కుమార్, ఒంగోలు డీపీఎం, ఏపీఎంలు నారాయణ, ఆదిశేషు, మండల స్త్రీనిధి మేనేజర్లు శ్రీనివాసరావు, సంపత్, డీఎంజీ షేక్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి ఉపయోగపడే పనులు కల్పించాలని సర్పంచ్ పువ్వాడి జయమ్మ పేర్కొన్నారు. మండలంలోని వీరభద్రాపురం గ్రామ పంచాయతి కార్యాలయంలో శనివారం ఉపాధి పథకం కింద జరిగిన పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ శనివారం నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పువ్వాడి రామారావు, పూనాటి వెంకటేశ్వర్లు, ఏపీవో బి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



కొత్తరెడ్డిపాలెంలో మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు స్వయంగా చీపురుపట్టి మురుగు కాల్వలను శుభ్రం చేశారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవితం సాగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, కమిషనర్ వై.మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ పి.వెంకటరామయ్య, ఆవుల రమణారెడ్డి, యేరువ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ఇబ్బందులు కల్గనివ్వం

చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా చూస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భరోసా ఇచ్చారు. శనివారం దర్శిలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆక్రమణలతో రోడ్లు కుచించుకుపోయినందున ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో అధికారులు ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారులు బండ్లు పెట్టుకొని కొంతకాలం వ్యాపారం చేసుకునే విధంగా అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దర్శి-కురిచేడు రోడ్డులో అన్నాక్యాంటీన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో చిరు వ్యాపారులకు స్థలాలు కేటాయించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వ్యాపారులు ట్రాఫిక్ సమస్య నివారణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎస్ఐ ఎంమురళీ, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరికి నివాళి

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దర్శిలో సెప్టెంబరు 2న జరిగే మెగా జాబ్ మేళా వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆంధ్రకేసరి జీవితం నేటి యువతకు ఆదర్శం

» మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, చైర్మన్ గఫార్

కనిగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. టంగుటూరి 98వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 1928 లో మద్రాసులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సందర్భంలో తెల్లోడి తుపాకి గుండుకి ఎదురొడ్డి తన గుండెను చూపించి ఇక్కడ కాల్చు అంటూ ముందుకు దూసుకుపోయిన గొప్ప ధైర్యశాలి ప్రకాశం పంతులు అని అన్నారు. తన యావదాస్తిని ప్రజల కోసం ఖర్చు చేసిన మహనీయుడు ప్రకాశం పంతులు అని అన్నారు. ఆయన దేశభక్తికి గుర్తుగా స్వాతంత్ర్యానంతరం ఆయనకు ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పదవి ఇవ్వటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికి ఎంతో నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప దేశభక్తుడు, మహనీయుడు అని అన్నారు. ఆయన జీవితం ప్రజాసేవకే అంకితమైందన్నారు. అందుకే అప్పటి ప్రభుత్వం ఆయన పుట్టిన ప్రాంతానికి ఆయన పేరుతో ప్రకాశం జిల్లాగా నామకరణం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, హెల్త్‌ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, జేఏ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆశయాలకు అనుగుణంగా..

తాళ్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం పంతులు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ముందుకు సాగుతామని బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఆయన 153 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సత్యం, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రాచకొండ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. తాళ్లూరు-1న చివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి.

ఆంధ్రకేసరికి నివాళి

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్‌రెడ్డి, కె.అనంతనాగలక్ష్మి, తోట రమేష్, ఎస్.జనార్దనరావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో రాణించిన పామూరువాసులు

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన డీఎస్సీ ఫలితాల్లో పామూరుకు చెందిన పలువురు పేదింటివారు సత్తాచాటారు. ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. స్థానిక సత్యనారాయణపురంకు చెందిన లారీ డ్రైవర్ కుమారుడు సయ్యద్ రహ్మత్ స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఓపెన్ కేటగిరిలో 37వ ర్యాంక్ సాధించాడు. పామూరు పట్టణానికి చెందిన కావిటి సురేష్ స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్) ఓపెన్ కేటగిరిలో ఐదో ర్యాంక్ సాధించాడు. పట్టణంలోని తూర్పువీధికి చెందిన పేద రైతు తుపాకుల ఆంజనేయులు కుమార్తె అనిత ఉపాధ్యాయ పోస్టు సాధించింది. ఇంకా పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు సాధించారు.



టీచర్ ఉద్యోగం పొందిన అనితకు మిఠాయి తినిపిస్తున్న తండ్రి



సురేష్



రహ్మత్‌బాషా

ఉర్దూ మీడియంలో టాపర్‌గా అర్షియాతబస్సుం

దొనకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 ఫలితాల్లో దొనకొండకు చెందిన షేక్ అర్షియా తబస్సుం సెకండరీ గ్రేడ్ ఉర్దూ మీడియం విభాగంలో 74.20 మార్కులతో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి ఉద్యోగం సాధించారు.

ఈసందర్భంగా అర్షియాత బస్సుంను బంధువులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

» ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ

పామూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ పనిచేస్తుందని రీజనల్ మేనేజర్ గద్దం సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి పథకం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. జిల్లాలో 485 బస్సులు ఉండగా, స్త్రీశక్తి పథకం కోసం వివిధ రూట్లలో 329 బస్సులు నడుపుతున్నామన్నారు. ఇప్పటివరకు 80 వేల మంది మహిళ ప్రయాణికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు సమకూరుస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను అద్దె ప్రాతిపదికపై లీజుకు ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి డిపో మేనేజర్ సయ్యద్ సయన బేగం పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న ఆర్ఎం సత్యనారాయణ

ప్రమాదమైనా పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

దొనకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నా ప్రయాణికులు పట్టాలు దాటుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. దొనకొండ రైల్వేస్టేషన్‌లో నంద్యాల నుంచి గుంటూరు వైపు వెళ్లే అన్నిరైళ్లు 3వ నెంబర్ ప్లాట్‌ఫాంకు వస్తాయి. ప్లాట్‌ఫాంలను మారేందుకు రైల్వేస్టేషన్‌లో వంతెనను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దొనకొండలో మూడవ నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు ప్రయాణికులు పట్టాలు దాటుతున్నారు. ఆసమయంలో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రక్షక దళం సిబ్బంది విజిల్స్ వేస్తూ హెచ్చరికలు చేస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. రైలు ఎక్కాలనే ఆత్రుతతో పట్టాలు దాటివెళ్తుండటం పరిపాటిగా జరుగుతుంది. గతంలో 1వ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి అవతలివైపునకు వెళ్లేందుకు ప్లాట్‌ఫాం నుంచి పట్టాలు దాటుతున్న సమయంలో పలువురు ప్రమాదాల బారినపడిన సంఘటనలు ఉన్నాయి. అయితే కొందరు వృద్ధులు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లు ఎక్కలేక ఇబ్బందులుపడుతూ రైలు పట్టాలు దాటుతుంటారు. దొనకొండ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టే లిఫ్ట్ నిర్మాణం పనులు నత్తతో పోటీపడుతూ ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. రైల్వే అధికారులు స్పందించి స్టేషన్‌లో లిఫ్ట్ నిర్మాణ పనులు పూర్తిచేసి ఇబ్బందులుతొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



దొనకొండ స్టేషన్‌లో పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ షేక్ జైనులద్దీన్ అన్నారు. శనివారం స్థానిక రైతుసేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలతో పాటు వ్యవసాయ పనిముట్లను అందజేస్తుందన్నారు. పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహా రెడ్డి సమకూర్చిన గొడుగు, ఫ్లాస్క్‌లను రైతులకు పంపిణీ చేశారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతగా కనిగిరిలో నిర్వహించిన రైతు సంబర సభకు పామూరు మండలం నుంచి ట్రాక్టర్లు వేసుకొని వెళ్లిన 58 మంది రైతలకు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అందజేసిన గొడుగులు, ఫ్లాస్క్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏవో టి.అబ్రహం లింకన్, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, యారవ శ్రీనివాసులు, ధైందే శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు!

పామూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన గణేష్ ఉత్సవ కమిటీ, శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద డీజేలు, లౌడ్ స్పీకర్లు పెట్టి అసౌకర్యాం కల్పించవద్దన్నారు. బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జన సందర్భంగా జరిగే ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యతని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కిశోర్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, విద్యుత్ ఏఈ షేక్ జిలానిబాషా, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు మెంటా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్త్రీశక్తి భవనం వద్ద మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి, ఎంపీపీ, జడ్పీటీసీలు

తాళ్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వచ్ఛందంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతంచేయాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. తాళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామాల్లో పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాన్ని కాలువల్లో వేయవద్దన్నారు. మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సానికొమ్ము సత్యం, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, తూర్పుగంగవరం సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాదికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో సానికొమ్ము సత్యం, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరి, టీడీపీ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చందన), సానె ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారాణి

దర్శి ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ పి.సంధ్యారాణి సూచించారు. శనివారం జరిగిన శిక్షణా, సందర్శన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది, పెసర పంటల్లో అంతరసేద్యం చేసుకోవాలని సూచించారు. తెగుళ్లు సోకకుండా అవసరమైన మందులను పిచకారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికార ప్రతినిధి రజనీకుమారి, కృషి విజ్ఞాన కేంద్రం పోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, సీనియర్ సైంటిస్టు సీహెచ్ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని చింతలపాలెం, తూర్పువీరాయపాలెం, బొట్లపాలెం గ్రామాల్లో సాగు చేసిన వరి, జొన్న, మొక్కజొన్న పంటలను కృషి విజ్ఞాన కేంద్రం పోగ్రామ్ కోఆర్డినేటర్ జి.రమేష్, ఏడీఏ బాలాజీ నాయక్, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎం.రజనీకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మండల ప్రత్యేకాధికారిగా నారాయణరావు

పామూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పామూరు మండల ప్రత్యేకాధికారిగా డీఆర్‌డీఏ పీడీ టినారాయణరావును జిల్లా కలెక్టర్ నియమించారు. ఇప్పటివరకు ప్రత్యేకాధికారిగా సేవలు అందించిన పరిశ్రమల అధికారి శ్రీనివాస్‌కుమార్ స్థానంలో డీఆర్‌డీఏ పీడీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పోలీసుల అనుమతితో విగ్రహాలు ఏర్పాటుచేసుకోవాలి



పునుగోడు చెరువు వద్ద రూట్ మ్యాప్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలను పోలీసుల అనుమతితో ఏర్పాటుచేసుకోవాలని ఎస్ఐ టి.శ్రీరాం అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి సంఘనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. శనివారం మండలంలోని పునుగోడు, గొల్లపల్లి చెరువులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీసులు నిర్దేశించిన రూట్ మ్యాప్ ద్వారానే విగ్రహాల నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు.

సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ విగ్రహాల కమిటీ నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు చేపట్టిన ఆంక్షలు, నిబంధనలను విగ్రహాల కమిటీ నిర్వాహకులకు తెలిపారు. అనంతరం నగరంలో పలు కేసుల్లో ఉన్న రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

● మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కె.శ్యాంబాబు

బాపట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరువారి ఆధ్వర్యంలో బాపట్ల కోర్టుల సముదాయం నందు సెప్టెంబరు 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కె.శ్యాంబాబు తెలిపారు. న్యాయ స్థానాల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని వివాదాలను శాంతియుతంగా రాజీ చేసుకొని పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

- మలివిడతలో 1,338 మందికి లబ్ధి
- రైతుల నుంచి వినతులతో పరిష్కారం
- త్వరలో ఖాతాల్లో అన్నదాత నిధులు జమ

మరికొందరికి.. సుఖీభవ

అన్నదాత సుఖీభవపై ఆందోళన వద్దు.. అర్హులు అయితే రెండో విడతలో నిధులు జమ చేస్తామని ఈ నెల 2న అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. అనర్హుల జాబితాలోని వారి నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగానే అధికారులు రైతుల నుంచి సచివాలయాల వారీగా అభ్యంతరాలు స్వీకరించారు. వాటిలో అర్హులుగా గుర్తించిన రైతులకు త్వరలో అన్నదాత సుఖీభవ నగదు లబ్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వ తప్పుల వల్లే జిల్లాలో అనేక మంది రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి జరగలేదని ఆయా అభ్యంతరాల ద్వారా తేలింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం రీ సర్వే తప్పులతో జిల్లాలో పెద్దసంఖ్యలో రైతులు అన్నదాత సుఖీభవ పథకం ఫలాలకు అనర్హులుగా మారారు. ఈ క్రమంలో ఈ నెల 20 వరకు ఆయా రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరించిన ప్రభుత్వం వాటిని పరిష్కరించింది. దీంతో జిల్లావ్యాప్తంగా 1,338 మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా వ్యవసాయశాఖ గుర్తించింది. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి ఇప్పటికే అందించింది. దీంతో వీరందరి ఖాతాల్లో త్వరలోనే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయనున్నది. ప్రభుత్వానికి అందిన అభ్యంతరాలలో ఎక్కువగా గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే తప్పిదాలే ఉండడం గమనార్హం. వాటితో



పాటు భూ యజమానులు మరణించడం, జాయింట్ ఎల్‌పీఎంలు, ఆధార్ అనుసంధానం జరగకపోవడం, ఈ-కేవైసీ పెండింగ్ వంటి కారణాల వల్ల కూడా అన్నదాత సుఖీభవ ప్రయోజనం రైతులకు దక్కకుండా పోయింది.

కౌలు రైతుల ఎదురుచూపులు

జిల్లాలో సేద్యం చేసేవారిలో అత్యధిక శాతం వాటా కౌలుదారులదే. దాదాపు రెండు లక్షల మంది వరకు కౌలు రైతులే ఉంటారు. ఇప్పటికే సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చినందున త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందించడంపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందితే పెట్టుబడి ఖర్చులకు అప్పులు చేయాల్సిన అగత్యం తప్పుతుందని కౌలు రైతులు ఆశగా ఉన్నారు.

అభ్యంతరాలకు అవకాశం

పీఎం కిసాన్ నిధులు రూ.2,000కు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు రూ.5,000లను ఈ నెల 2నే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. జిల్లావ్యాప్తంగా 1,60,432 మంది రైతుల ఖాతాల్లో రూ.112 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. తొలి విడతలో భాగంగానే ఈ నిధులు విడుదల చేస్తున్న ట్లు ప్రభుత్వం ప్రకటించింది. అన్నదాత సుఖీభవ పథకం నిధులు పడని రైతులు కంగారుపడొద్దని, అభ్యంతరాలు తెలపడానికి అవకాశం కల్పిస్తామని, పునఃపరిశీలనలో అర్హులని తేలితే పథకం డబ్బులను ఖాతాల్లో జమ చేస్తామని ఈ నెల 2నే ప్రభుత్వం తెలిపింది. దీంతో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైనప్పటికీ ఖాతాల్లో డబ్బులు పడని రైతులు వివరాలను అందించాలని ప్రభుత్వం కోరింది. దీనిలో భాగంగా వీఏఏల దగ్గరకు మొత్తం 1,617 అభ్యం తరాలు వచ్చాయి. వీటిలో 1,571 దరఖాస్తులు మం డల వ్యవసాయాధికారి వద్దకు చేరగా తుది పరిశీలన అనంతరం 1,312 మంది అర్హులుగా తేల్చి, 259 దరఖాస్తులను తిరస్కరించారు. మండల తహసీల్దార్ లాగిన్లకు 46 అభ్యంతరాలు రాగా వీటిలో 26 ఆమో దించి నాలుగింటిని తిరస్కరించారు. మరో 16 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. రీ వెరిఫికేషన్‌లో భాగంగా భట్టిప్రోలు మండలం నుంచి అత్యధిక సంఖ్యలో 279 మంది రైతులు అర్హులుగా తేలారు. అద్దంకి 106, కర్లపాలెం 88, జె.పంగలూరు 87, నిజాంపట్నం మండలం 83 మంది రైతులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

- జీతాలకు ముఖహాజరు లింకుపై ఆగ్రహం
- జూనియర్ కళాశాల అధ్యాపకుల ఆందోళన
- అసంబద్ధ నిర్ణయాలపై ఇప్పటికే అసంతృప్తి



ఇచ్చేదే కొసరు.. ఆపై కోతలా?

బాపట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ హాజరు(ఎఫ్ఆర్ఎస్ - ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) ఆధారంగా జీతాలన్నట్లు వచ్చిన సమాచారంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 35 జూనియర్ కళాశాలలు ఉండగా 230 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, ఎక్కువ సంఖ్యలో బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. గతంలో కళాశాలలు పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేవి. ఇప్పుడు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని వేళలు పెంచారు. అయితే రవాణా సౌకర్యాలు లేక దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎప్పటి మాదిరిగానే ఉదయం 10 గంటలకు కళాశాలకు వస్తున్నట్లు తెలుస్తుంది. అయినా అధ్యాపకులు 9 గంటల నుంచి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అసంబద్ధంగా పని గంటలు ఎలా పెంచుతారని అధికారులపై ఇప్పటికే లెక్చరర్లు మంత్రులకు ఫిర్యాదు చేశారు. ఆ విషయం ఎటూ తేలక ముందే జీతాలకు ముఖ హాజరు లింకుపెట్టడంపై ఆగ్రహం వెల్లువెత్తుతోంది.



ఐదు నిమిషాలు ఆలస్యమైనా..

ఎఫ్ఆర్ఎస్ అమలుతోనే గత జగన్ ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత నెలకొంది. ప్రభుత్వం మారిన తర్వాత కొంత మార్పులు వస్తాయని ఉద్యోగులు ఆశించారు. అయితే ఇందుకు విరుద్ధంగా (మిగతా 4లో)

అసలే చేతికి వచ్చే జీతం తక్కువ.. ఆపై జీతాలకు ముఖ హాజరుతో కోతలు పడతాయని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా క్రమబద్ధీకరణపై ఆశతో తక్కువ వేతనాలు అయినా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆ జీతాలకూ కోత పడేలా ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో ఇప్పటికే అధికారులు వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అసంబద్ధ పని గంటలు, క్రమబద్ధీకరణ పెండింగ్‌పై ఆందోళనలో ఉన్న వారిని మరింత ఆవేదనకు గురి చేసేలా జీతాలకు ముఖహాజరును ముడిపెడుతుండటంపై లెక్చరర్లు మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా పలు నిబంధనలు అమలు చేసి ఉద్యోగులను ప్రభుత్వానికి దూరం చేసేందుకు ఉన్నత విద్యాశాఖలోని కొందరు ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

● సమీక్షలో డీఎల్‌పీవో పద్మ

వేమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేలపై ఉద్యోగులు అవగాహన కలిగి వాటిని సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీవో పద్మ ఆదేశించారు. శనివారం ఆమె వేమూరు పంచాయతీ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బందితో సర్వేల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ క్యాంపులు, ఏఎన్ఎంల పని తీరు గ్రామాల్లో పారిశుధ్యం ఇంటి పనుల వసూలు పంచాయతీ ద్వారా వివరాల సేకరణ తదితర అంశాలపై చర్చించారు. సచివాలయాల్లో పని చేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డిప్యూటేషన్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్, కార్యదర్శి భూపతిరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నీటితో రోగాల భయం

- దుర్వాసన, దోమలతో అల్లాడుతున్న ప్రజలు
- పల్లెలను పట్టించుకోని పంచాయతీ అధికారులు



వారం రోజులుగా పెనుమూడి బీసీ కాలనీలో తొలగని వర్షపునీరు

రేపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో పంటలు మునిగి రైతులు నష్టపోగా.. ఇళ్ల మధ్య నిలిచిన నీటితో పారిశుధ్యం అడుగంటి గ్రామీణులు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా ఇళ్ల మధ్య నీరు నిలిచి ఉంది. దీంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే అంటువ్యాధులు ప్రబలి ఇటీవల మరణాలతో పాటు ఎందరో ఆస్పత్రుల పాలయ్యారు. ఇంతలోనే కురిసిన వర్షాలతో పారిశుధ్యం అడుగంటి పోవడంతో ఎక్కడ రోగాలు వ్యాపిస్తాయోనని ప్రజ లు భీతిల్లుతున్నారు. ఒక పక్క గ్రామాలు శుభ్రంగా ఉండాలని, అంటువ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని ప్రకటనలు చేస్తున్న అధి కారులు వారం నుంచి పల్లెల్లో నెలకొన్న పరిస్థితులను పట్టించుకోవడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెనుమూడి బీసీకాలనీలో వారం రోజులుగా గృహాల మధ్య వర్షపునీరు చేరి బయటకు వెళ్లే పరిస్థితి లేక తిష్ట వేశాయి. దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగిపోవడంతో విషజ్వరాలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మురుగునీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా నీటిలోనే వెళ్తా పడి గాయాలపా లవుతున్నారన్నారు. గృహాల మధ్య మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అడవి కాదు.. ఆస్పత్రే

- స్వచ్ఛాంధ్ర వర్తించదా అని ప్రశ్నలు
- రోగులను భయపెట్టేలా పరిసరాలు

అద్దంకి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిచ్చిచెట్లు గుబురుగా మారి.. అధ్వానంగా ఉన్న పరిసరాలను చూస్తే ఎవరైనా అదేదో చిట్టడవి అనుకుంటారు. రోగులకు చికిత్సలు అందజేసే ప్రభుత్వ ఆస్పత్రి అంటే ఎవరూ నమ్మరు. కానీ ఎవరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. అధికారుల నిర్లక్ష్యానికి.. ప్రజారోగ్యంపై వారిలో ఉన్న శ్రద్ధకు అద్దంకి ప్రభుత్వ వైద్యశాల పరిసరాల్లో పెరిగిన చెట్లే నిదర్శనంగా కనిపిస్తాయి. ఆవరణలో చిల్లచెట్లు, గడ్డి తొలగించకపోవడంతో చెట్లు పెద్దవిగా పెరిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి ఏపుగా పెరిగింది. ప్రతీ నెల నాలుగో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు కార్యాలయాల్లో తప్పకుండా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా ఇక్కడి వైద్యాధికారులకు పట్టడంలేదని అర్థమవుతోంది. రోగులు ఉండే గదులు, ఆపరేషన్ థియేటర్ పక్కనే చెట్లు, ఏపుగా పెరిగిన గడ్డితో అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్రతతో ఆస్పత్రిలో రోగులు దోమల బెడదతో అల్లాడుతున్నారు. విష సర్పాల సంచారంపై ఆందోళన చెందుతున్నారు.



అద్దంకి లోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

- ఈ-పోస్‌లో మారని సిబ్బంది వేలిముద్రలు
- జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో నిలిచిన విక్రయాలు

ఎరువులు ఉన్నా.. విక్రయాలు లేవు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎరువులు అందవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు ఉన్నా విక్రయాలు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వందలాది మంది వ్యవసాయ, ఉద్యాన అసిస్టెంట్లను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. సిబ్బందిని బదిలీ చేసినా వారికి అధికారాలు బదిలీ చేయకపోవడంతో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. బదిలీపై వచ్చిన ఉద్యోగుల వేలి ముద్రలు ఈ-పోస్‌లలో అప్‌లోడ్ చేయడాన్ని వ్యవసాయ, ఉద్యాన శాఖలు మరిచాయి. దీంతో రైతు సేవా కేంద్రాలకు ప్రభుత్వం ఎరువులు సరఫరా చేసినా రైతులకు విక్రయించలేని దుస్థితి నెలకొంది. బదిలీలు జరిగి నెల రోజులు దాటినా సదరు ఉద్యోగుల లాగిన్ ఐడీలు మార్చక పోవడంతో రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో ఎరువుల కోసం రైతులు ఆర్ఎస్కేలకు వచ్చి నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. పల్నాడు జిల్లాలోని కేంద్రాలకు 5,300 టన్నుల ఎరువులను సరఫరా చేశారు. ఇదే స్థాయిలో బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కూడా ఆర్ఎస్కేలకు ఎరువులను సరఫరా చేశారు. అయితే సాంకేతిక సమస్యల వల్ల రైతులకు ఎరువులు అందడంలేదు. వర్షాలు, కాల్వలకు నీటి విడుదలతో పంటల సాగు ఊపందుకుంది. ఎరువులు తక్షణావసరంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఆర్ఎస్కేలలో ఎరువులు విక్రయాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. అధికారుల అవగాహనా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యాన, వ్యవసాయ అసిస్టెంట్ల వేలిముద్రలను ఈ-పోస్‌లో అప్‌లోడ్ చేసి, లాగిన్ వసతిని కల్పించి ఎరువుల విక్రయాలు సాఫీగా జరిగేలా అధి కారులు చర్యలు తీ సుకోవాలని రైతులు కోరుతున్నారు.



పొగాకు సాగు ఏడాది నిషేధం

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- అధికారులదే బాధ్యతన్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో బ్లాక్, వైట్ బర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం నిషేధం విధించినందున రైతులు ఎవ్వరూ ఒక్క ఎకరా కూడా సాగు చేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఏడాది పాటు పొగాకు సాగు నిషేధంపై ప్రభుత్వం జీవో 740 జారీ చేసినందున కఠినంగా అమలు చేయాలన్నారు. నిషేధంపై అన్ని గ్రామాల్లో దండోరా వేయించాలని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నియమించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు క్షేత్ర స్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఎక్కడైనా రహస్యంగా పొగాకు సాగు చేస్తే వెంటనే పెరికివేయాలన్నారు. పొగనారు పెంచినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టిసారించేలా చూడాలన్నారు.

ఎరువుల అక్రమాలపై చర్యలు

ఎరువులు, పురుగుమందులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఎరువుల కృత్రిమకొరత సృష్టించడానికి వ్యాపారులు ప్రయత్నిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేసి అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

పరిశుభ్రత కోసమే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

- ర్యాలీలో కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన
- కలెక్టరేట్‌లో చెత్త ఊడ్చి ప్రతిజ్ఞ చేసిన అధికారులు

బాపట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అధికారులు, నాయకులతో కలిసి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. చీపుర్లు పట్టి రోడ్డులు ఊడ్చి చెత్తాచెదారం తొలిగించి కలెక్టరేట్ ప్రాంగణం శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల్ని విస్తృతంగా చేపట్టిన సంస్థలకు అక్టోబరు 2 గాంధీజయంతి సందర్భంగా అవార్డులు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రణాళిక అధికారి షాలెంరాజు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

- ఈపూరుపాలెం రేషన్ దుకాణం తనిఖీలో జేసీ

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు అందించే రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని జేసీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి శనివారం చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రేషన్ షాపు నెం.8లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ నెల 26 నుంచి నెల చివరి తేదీ వరకు వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు రేషన్ సరుకులు డీలర్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలన్నారు. అలాగే మొదటి తేదీ నుంచి కార్డుదారులకు సరుకులు అందించాలని సూచించారు. వ్యత్యాసం గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో సివిల్ సప్లై జిల్లా అధికారి జమీర్‌బాషా, డీటీ గీత పాల్గొన్నారు.



స్టాకు వివరాలు పరిశీలిస్తున్న జేసీ గంగాధర్‌గౌడ్

అవీ..ఇవీ..

చీరాల్లో కాకరేపుతున్న ఆస్పత్రి వివాదం

● విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల యుద్ధం

● పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితి

చీరాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలోని ఓ ఆస్పత్రి నిర్వహణ వ్యవహారం కాకరేపుతోంది. భవనం యజమాని, హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్‌లు ఒకరిపై ఒకరు విమర్శలు ప్రతి విమర్శలు చేసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. అదేవిధంగా పోలీసులను ఆశ్రయించడంతో ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

ఆదిలో అందరివారే..ఇప్పుడేమో ఎవరికి వారే..

2013లో భవనంలో సదరు భవనంలో అద్దెకు నిర్ణయించుకున్నారు. అనంతరం ఇరువురు అన్ని రంగాల్లో ముందుంటూ లావాదేవీలు నిర్వహించుకున్నారు. ఈక్రమంలో చాలా వరకు ఈ ఇద్దరు పట్టణంలో పేరు గడించారు. అయితే కాలక్రమేణ భవనంకు సంబంధించిన అద్దె విషయంలో ఇద్దరి మధ్య విభేధాలు చెలరేగాయి. అద్దె బకాయి ఒకరేమో రూ.2కోట్లు అంటుంటే మరొకరు రూ.25 లక్షలే అంటూ పలుమార్లు పంచాయతీలు కూడా నిర్వహించారు. అయతే అవి సఫలం కాలేదు. దీంతో ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పిస్తు రోడ్డెక్కారు. అంతేకాకుండా ఒకరిపై ఒకరు జిల్లా అధికారులకు. రాజకీయ నేతలకు పిర్యాదులు చేసుకుంటూ వచ్చారు.

ఈ క్రమంలో అద్దెచెల్లించడం లేదని భవనం యజమాని ఆస్పత్రికి తాళాలు వేయించాడు. ఈ క్రమంలోనే భవనం యజమాని, ఆస్పత్రి నిర్వాహకుడు ఒకరినొకరూ దూషించుకుంటూ స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం వైరల్‌గా మారింది. దీనిపైవారు ఇరువురు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. అయితే దీనిపై ప్రస్తుతం విచారణ చేస్తున్నారు. చివరకు ఈ వివాదం ఎటువైపు వెళుతుందోనని స్థానికంగా చర్చ నడుస్తోంది.

విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత



క్రీడాదుస్తులను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ

అద్దంకిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. గతంలో కళాశాలలో పీడిగా పనిచేసిన కె. డేవిడ్‌రాజు విద్యార్థులకు క్రీడా దుస్తులను సమకూర్చారు. ప్రిన్సిపాల్ ఈ. కోటేశ్వరమ్మ దుస్తులను ఆ విష్కరించారు. విద్యార్థులకు క్రీడలలోను ఆసక్తిని పెంచుకుని ముందుండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్వరమ్మ, పద్మవతి, బుజ్జిబాబు, ఆనంద్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇరుపక్షాలతో మాట్లాడి కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. సెప్టెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కోర్టు లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్, ఇతర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, ఏపీపీ వడ్డవల్లి వీరనారాయణ, ఏజీపీ రమేష్‌బాబు, అద్దంకి, సంతమాగులూరు,మార్టూరు సీఐలు సుబ్బరాజు, వెంకటరావు, శేషగిరి, ఎస్సైలు,ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు

ఒంగోలు క్రైం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఈగల్ టీం పూరి ఎక్స్‌ప్రెస్‌ను విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా నాలుగు కిలోలు గం జాయి స్వాధీనం చేసుకొని ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుంది. ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు సంయుక్తంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. పూరి ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి ఎక్కడ నుంచి తరలిస్తున్నారనే విషయంపై ముగ్గురు అనుమానితులను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చెంచయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

ఒంగోలు నగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్ర భుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగుల్లో అర్హులైన వారి పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని జాతీయ విభిన్నప్రతిభావంతుల హక్కుల సాధన ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎం. సులోచనరాణి డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ట్ర స్టు కార్యాలయం వద్ద జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చిందని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని శాశ్వత ఉద్యోగిగా చూపించి.. ఇలా అనేక కుంటి సాకులతో 95వేల మంది దివ్యాంగుల పింఛన్లను రద్దు చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్ పేరుతో రద్దు చేయబోతుందన్నారు. ప్ర భుత్వం అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. నేడు బోగస్ అంటూ రద్దు చేస్తున్న పింఛన్లు మంజూరు కావ టానికి సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై కూడా చర్యలు తీసుకో వాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో మదర్‌తెరిసా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ అమీర్, పును మర్తి రాజేష్, సలోమి, లక్ష్మయ్య, శేషయ్య, గుల్జార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు

● ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్పీ ఏఆర్.దామో దర్ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో విద్యార్థుల భద్రత, క్రమశిక్షణపై కళాశాల యజమానులు, తల్లిదం డ్రులు, వార్డెన్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళాశాలల్లో యాజమాన్యం కేవలం విద్యాబోధన మాత్రమే కా కుండా విద్యార్థుల నడవడిక పట్ల కూడా తనగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. అంతేగాకుండా కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి నేరాలను అ రికట్టేందుకు యజమాన్యం చర్యలు తీసుకోవాలని చెప్పారు. కళాశాలలో మహిళల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు రాఘవేంద్ర, దేవప్రభాకర్, విజయకృష్ణ, ఎన్.శ్రీకాంత్‌బాబు, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇసుకదర్శి వాగు, మార్టూరు వాగు, దేగరమూడి వాగు

పచ్చని మైదానాలు కాదు... జమ్ముతో నిండిన వాగులు

మార్టూరు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): పై ఫొటోలలో కనిపిస్తున్నవి పచ్చని మైదానాలు అనుకుంటూ మీరు పొరబడినట్లే నీటితో, గల గల పారే వాగులు. ఈ వాగులలో నీటిపైన తూటు ఆకు, జమ్ము పేరుకుపోవడంతో పైన పచ్చగా కనిపిస్తూ, క్రింద నీళ్లు ఉన్నట్లు కూడా మనకు కనిపించడం లేదు. మార్టూరు మండలపరిధిలో ఎగువనుండి పారుతూ వస్తున్న ఇసుకదర్శి వాగు జొన్నతాళి, రాజుగారిపాలెం గ్రామాలను కలుపుతూ మార్టూరు చేరి, అక్కడనుండి, దేగరమూడి నుంచి యద్దనపూడి మండలం మీదగా, పర్చూరు మండలానికి చేరుతోంది. ఆ వాగులో చిల్లచెట్లు, తూటుకాడ, జమ్మును తొలగించేందుకు అప్పటి పాలకులు. ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదు. ఈ కారణంగా ఈ వాగులలో తూటు ఆకు, జమ్ము పేరుకొనిపోయాయి.తద్వారా నీళ్లు సక్రమంగా, వేగంగా ప్రవహించడం లేదు. దూరం నుండి చూస్తే అవి వాగులే అంటే నమ్మే పరిస్థితి లేదు. వాగుల్లో పూడిక తీయిస్తే నీరు సక్రమంగా పారుతుందని రైతులు పేర్కొంటున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి



పంగులూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

బల్లికురవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయుష్ శాఖ పూనూరు వైద్యశాల వైద్యురాలు అంజమ్మ పేర్కొన్నారు. శనివారం బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం 250 మంది విద్యార్థులకు డెంగ్యూ రాకుండా ముందుస్తుగా మందులను అందించారు. కార్యక్రమం అనంతవరం వైద్యశాల వైద్యురాలు సౌమ్య, మార్టూరు, అంబడిపూడి వైద్యశాలల ఫార్మాసిస్టులు తనుజా, శేషసాయి సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ పి.సింగారావు, ఎంపీడీవో కె.సుమంత్ అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయితీ కార్యాలయం నుంచి ఎస్‌సీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి పారిశుద్యం, పరిసరాల పరిశుభ్రత, డెంగ్యూవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలోని ఆదర్శపాఠశాల విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి నాగేంద్రంరామారావు, ఎస్‌ఐవీ వినోద్‌బాబు, ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవో సంతోషం, హెచ్‌ఎం కంకణాలశ్రీనివాసరావు, కార్యదర్శి బి.రాంబాబు, సచివాలయ, వెలుగు సిబ్బంది, ఆశావర్కర్లు, పారిశుధ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఇంకొల్లు ఎస్సై సురేష్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీసుస్టేషన్ పరిసరాలలోని చెత్త,చెదారాన్ని సురేష్ శుభ్రం చేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడు ఆరోగ్యవంతంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : వర్షాకాలం వస్తున్నందున పరి అది మన అందరి బాధ్యత అని ఏఎంసీ కార్యదర్శి కె. సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యార్డు ఆవరణంలో మొక్కలు నాటారు. సిబ్బందితే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మందా నాగేశ్వరరావు, ఏఎంసీ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు అంజమ్మ, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎంసీ కార్యదర్శి సూర్యప్రకాష్‌రెడ్డి

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ రాష్ట్ర మహాసభలో నేతల పిలుపు

ఒంగోలుక్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి. డబుల్ ఇంజన్ సర్కార్‌పై డబుల్ పోరాటాలు తప్పవు. రాష్ట్రంలో ఉన్న పేదలు ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించే వరకు అన్ని గ్రామాల నుంచి ఉద్యమాలు చేపట్టాలి. అందుకు ఎర్ర జెండా ముందు ఉండాలి. అదేవిధంగా వామపక్షపార్టీల పునరేకీకరణ జరిగి ఏకతాటిపైకి వచ్చి సమష్టిగా పోరుబాట పట్టాలి' అని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ ఆవరణలో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలలో భాగంగా బహిరంగ సభ జరిగింది. ముందుగా నెల్లూరు బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి కళకారుల డప్పుల దరువు, వివిధ రకాల విన్యాసాలు, కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో తొలుత సీపీఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మాట్లాడుతూ నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన నక్సలిజంను అంతం చేయలేరన్నారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలు తన నియంత పాలనకు అడ్డు వస్తున్నాయని, వాటిని నిర్వీర్యం చేసే పనిలో పాలకులు ఉన్నారని చెప్పారు. గవర్నర్లు కేంద్రానికి దళారులుగా మారుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న మోదీకి చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్‌లు రెండు కాళ్లుగా నిలబడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు స్వలాభం కోసం 100 ఎకరాలు భూమి అవసరం ఉంటే 1,000 ఎకరాలు కావాలని ఉబలాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. పూటకో వేషం రోజుకో మాట మారుస్తున్న పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని నెత్తికి ఎత్తుకొని తిరుగుతున్నాడని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ పేదల కోసం వందేళ్ల త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ అని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదన్నారు. దొంగ ఓట్లతో బీజేపీ రాజ్యమేలుతుందని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని చెప్పారు. అలాంటి పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించే వరకు డబుల్ ఇంజన్ స్పీడ్‌తో పోరాటం చేయాలని, అందుకు ప్రజలు సమాయత్తం కావాలన్నారు.

అనంతరం సినీహీరో, సీపీఐ నేత మాదాల రవి ప్రసంగించారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరావు, జేవీవీ.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి.హరినాథరెడ్డి, జి.ఓబులేసు, పి.రామచంద్రయ్య, జగదీష్, కేవీవీ.ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్, డేగా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ పీజే.చంద్రశేఖర్, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

వైద్యాధికారుల పీజీ కోటాను కొనసాగించాలి

● ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీసు డాక్టర్ పీజీకోటాను 20శాతం కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాటమాల రాహూల్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాహూల్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ డాక్టర్ పీజీ కోటాను 20శాతం నుంచి 15శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. కేవలం ఏడు శాఖల్లో సర్వీసు కోటా కాకుండా గతంలో మాదిరిగా అన్ని శాఖల్లో సర్వీసు కోటా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ సర్వీస్‌కోటా తగ్గించే విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుందర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇన్‌సర్వీసు వైద్యాధికారుల కోటాను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నబీవలి, డాక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైద్యులు

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

● రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులు కూటమికి ఓట్లువేసి గెలిపించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఇంత వరకు బాధితుల గోడు పట్టించుకోలేదని ఆరోపించారు. అగ్రిగోల్డ్ కంపెనీ పనిచేస్తున్న సమయంలో రియల్‌ఎస్టేట్ ప్లాట్‌లను, ఫామ్ ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితుల భూములను ప్రభుత్వం వెంటనే అటాచ్‌మెంట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసిన బాధితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అగ్రిగోల్డ్ అస్తులను ఆర్డర్ సంస్థ ద్వారా విలువలు లెక్కించానపి. సంస్థ భూములను వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీ.నాయుడు, ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.హనుమారెడ్డి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు, అగ్రిగోల్డ్ బాధితులు మాణిక్యాలరావు, శేషుకుమార్‌రెడ్డి, రాంబాబు, నాగలక్ష్మి, నాయక్, సుబ్బారావు, రామదాసు, ఖాదర్, శంకరయ్య, భద్రం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకులు బరితెగించారు..!

● మాటామాటా పెరిగి కత్తులతో దాడికి యత్నం

● పారిపోయి ఇంటికి చేరిన బాధిత యువకుడు

● చీరాల మండలం కావూరివారిపాలెంలో ఘటన

కావూరివారిపాలెం(చీరాల), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇరువురు యువకులతో మరొక యువకుడికి మాటామాటా పెరిగిన వ్యవహారం కత్తులతో దాడిచేసే దాకా వచ్చింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారించారు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఒక కుటుంబం కొంతకాలంగా కావూరివారిపాలెంలో నివాసం ఉంటోంది. ఈక్రమంలో వారి కుమారుడుకు స్టూవర్టుపురానికి చెందిన మరో ఇద్దరు యువకులతో కొంతకాలంగా పరిచయం ఉంది. అయితే ఇటీవల పిచ్చాపాటిగా మాట్లాడుకునే క్రమంలో విభేధం చెలరేగింది. ఈక్రమంలో శనివారం రాత్రి సమయంలో వెదుళ్లపల్లికి వచ్చిన సదరు యువకుడిని అడ్డగించేందుకు వారు ప్రయత్నించగా యువకుడు కావూరివారి పాలెం పరారయ్యాడు. ఈక్రమంలో అతనిపై దాడిచేసేందుకు ఇరువురు యువకులు కూడా వెంబడించారు. అయితే గ్రహించిన స్థానికులు వారిని పట్టుకుని ఆరా తీయగా వారి వద్ద కత్తులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రూరల్ సీఐ శేషగిరిరావుకు సమాచారం అందించడంతో సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుసులోకి తీసుకుని విచారిస్తున్నారు. శనివారం రాత్రి ఈ ఘటనలో గ్రామంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

ఇచ్చేదే కొసరు.. ఆపై కోతలా?

(5వ పేజీ తరువాయి)

నిర్ణయాలు తీసుకోవడం విచిత్రం. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఐదు నిమిషాలు ఆలస్యంగా హాజరు వేసినా ఆ రోజు ఆబ్‌సెంట్‌గా చూపిస్తున్నదని పలువురు వాపోతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా జూనియర్ కళాశాలలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఆయా కళాశాలలకు ఎక్కువమంది లెక్చరర్లు సుమారు 80 కిలోమీటర్ల ప్రయాణించి విధులకు హాజరౌతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎఫ్ఆర్ఎస్ వల్ల వచ్చే జీతంలో కోతలు ఎక్కువగా ఉంటాయి. సెల్‌సిగ్నల్ లేకపోయినా.. యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినా ఉద్యోగికే నష్టం జరుగుతుంది. ఇస్తుందే తక్కువ జీతం.. అందులో కోతలు అంటే ఎలా అని పలువురు లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 230 మంది కాంట్రాక్టు లెక్చరర్లలో ఎక్కువ మంది క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత క్రమబద్ధీకరణ ప్రక్రియకు బ్రేక్‌తో 14 నెలలుగా అసంతృప్తితో ఉద్యోగం చేస్తున్నారు. క్రమబద్ధీకరణ విషయాన్ని పట్టించుకోకుండా అధికారులు ఎఫ్ఆర్ఎస్‌కు జీతాలు లింకు పెట్టేందుకు ప్రయత్నం చేయడంపై అసంతృప్తి, ఆందోళన వెల్లువెత్తుతోంది.

నేడు టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కమిటీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక గుంటూరు రోడ్డులోని పీఏజీ కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. నియోజవర్గ కమిటీ పరిశీలకులు గుమ్మడి సంధ్యారాణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కనపర్తి శ్రీనివాస్ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఎం పీలు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నియోజకవర్గపరిశీలకులు, రా ష్ట్ర, జిల్లా నామినేట్ చైర్మన్లతో పాటు ముఖ్యనాయకులందరూ పాల్గొని విజ యవంతం చేయాలని ఆయన కోరారు.

డీఎస్సీలో శ్రీవికాస్ విద్యార్థుల ప్రతిభ



అంజనిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. స్కూలు అసిస్టెంట్ గణితంలో తిమ్మసముద్రం గ్రామానికి చెందిన జి.అంజని 93.013మార్కులతో మొదటి ర్యాంకుతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. ఎస్‌జీటీ విభాగంలో కరవదికి చెందిన ఐ.మౌనిక 89.8 మార్కులతో 11వ ర్యాంకు, ఎస్ఏ బయాలాజికల్‌లో పొదిలికి చెందిన స్వాతిక 83.67 మా ర్కులతో 5వ ర్యాంకు, గణితం విభాగంలో ధైవాలరావూరుకు చెందిన అరుణ ప్రసాద్ 83.77 మార్కులతో పదో ర్యాంకు సాధించారు. మరికొందరు కూడా డీఎస్సీలో మంచిమార్కులు సాధించి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సం దర్భంగా విద్యార్థులను స్థానిక కోచింగ్ సెంటర్‌లో శనివారం కరస్పాండెంట్ కెమోహన్‌రావు, డైరెక్టర్ వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు.

'ఒంగోలు తాలూకా సర్వస్వం' పుస్తకావిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం పంతులు సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధులు గుండ్లాపల్లి ఆదినారాయణపంతులు షష్టి పూర్తి మహోత్సవ సంచిక నుంచి యధాతథంగా స్వీకరించిన ఒంగోలు తాలూకా సరస్వం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఒంగోలులోని పీవీఆర్ స్కూలులో జరుగుతున్న పుస్తక మహోత్సంలో మాదాలరంగారావు కళావేదికలో ఈ పుస్త కాన్ని విడుదల చేశారు. రచయిత రామచంద్రుని వెంకటప్ప ఈ పుస్తకంలో ఒంగోలుకు సంబంధించిన అన్ని విషయలను, వ్యక్తులపై సమగ్రంగా వివరిం చారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి గుండ్లాపల్లి కృష్ణయ్య, పోన్నూరి వెంకట శ్రీనివాసులు, ధేనువుకొడ సుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది పంగులూరి గో విందయ్య, ఉప్పలపాటి వెంకటరత్నం, వీవీ.నరసింహారెడ్డి, సంపత్‌కుమార్, రి టైర్డ్ రిజిస్ట్రార్ జి.మురళీకృష్ణ, భైరవునేని సూర్యానారాయణ పాల్గొన్నారు.

128 మందికి వైద్య సేవలు

మద్దిపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడులో శనివారం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 128 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

నాగులుప్పలపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులోని గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు బాలల హక్కులపై జిల్లా బాలల సం రక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, కుమారి, అనిత, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం : చైర్మన్

సింగరాయకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలను వెంట నే పరిష్కరిస్తామని వినియోగదారుల అదాలత్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. శనివారం మూలగుంటపాడు కాకతీయ కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన పా ల్గొని మాట్లాడారు. గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, అవసర మైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూ చించారు.

డీఎస్సీలో మెరిసిన ఆశావహులు

మెరిట్ జాబితాలో పేరు ఉండడంపై హర్షం

పర్చూరు, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు కోసం సుదీర్ఘ కాలం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. శనివారం విడుదల చేసిన మెరిట్ జాబితాలో మంచి ర్యాంకు సాధించడంతో వారి ఆనందానికి అంతులేకుండా పోయింది. ఉద్యోగం కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న కలనేటికి నెవవేరనుందని ఆనంద భాష్పాలు వ్యక్తం చేస్తున్నారు. వివాహమై భార్యా పిల్లలతో కుంటుబ భారం మోస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగంపై ఉన్న మక్కువతో రాత్రనక పగలనక చేసిన కృషి ఎట్టకేలకు ఫలించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ భర్తీని పట్టించుకోక పోవటంతో డీఎస్సీ కోసం ఎదురు చూసిన నిరుద్యోగులకు నిరాశే ఎదురైంది. గత ప్రభుత్వ ఐదేళ్లలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయక పోవటం, మరోవైపు వయస్సు పైబడడంతో నిరుద్యోగులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో వారి కలసాకారమైంది. పలువురు డీఎస్సీ మెరిట్ జాబితాలో చోటు సంపాదించారు.



కుటుంబ సహకారంతోనే విజయం



పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వల్లభరెడ్డి మధుసూదన్‌రెడ్డి జిల్లా స్థాయిలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 77.77 మార్కులతో 23వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. దశాబ్దకాలం నుంచి ఉపాధ్యాయ కొలువు కోసం ఎదురు చూస్తున్నారు. ఆ కలను ప్రజా కూటమి ప్రభుత్వం సాకారం చేసింది. తన విజయానికి కుటుంబ సహకారం మరువలేనిదని ఆయన చెప్పాడు.

వల్లభరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నూతలపాడు

ప్రభుత్వ చొరవ మరువలేం



ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం చేసిన కృషి ప్రజా కూటమి ప్రభుత్వ చొవరతో సాకారమైంది. పర్చూరు మండలం ఉప్పుటూరుకు చెందిన షేక్.అలీ ముద్దీన్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 74.56 మార్కులు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకంలో ఆశావాహులుగా ఉన్నారు. జిల్లా స్థాయిలో 51 ర్యాంకు, ఈడబ్ల్యూఎస్‌లో 3వ ర్యాంకు సాధించారు.

షేక్ అలీముద్దీన్, ఉప్పుటూరు

కల సాకారమైంది



ఎన్నో ఏళ్ళుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విజయం సాధించాలన్న కల సాకారం కావడం ఆనందంగా ఉంది. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో 72.97 మార్కులు సాధించాను. ప్రస్తుతం ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రభుత్వ ఉపాధ్యాయనికిగా సేవలందిం చాలన్న కల సాకారం కానుంది.

పఠాన్ షాఫియా బేగం, పర్చూరు

పిల్లలతోపాటు తాను చదువుకుంటూ...



పర్చూరుకు చెందిన షేక్.హీనా 15 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త టైలరింగ్ చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నారు. గృహిణిగా ఉంటూ. భర్త షేక్.ఆలీమ్ ప్రోత్సాహంతో తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో హిందీ విభాగంలో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, మహిళా విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. డీఎస్సీ కోసం మెటీరియల్‌ను తెప్పించుకొని ఇంటివద్దనే ప్రిపేర్ అయినట్లు ఆమె తెలిపారు.

షేక్.హీనా. పర్చూరు

ఏళ్లుగా చేస్తున్న కృషి ఫలించింది



15 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం చేసిన కృషి ఫలించింది. ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో సూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలో 14 ర్యాంకు సాదించటం ఆనందంగా ఉంది. ఆరేళ్లగా వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాను. నిరుద్యోగులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఆదుకుంది.

కొప్పుల విజయ్ కుమార్, పర్చూరు

అవీ..ఇవీ..

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఐక్యనగర్(చీరాల), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చెందిన ఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని ఐక్యనగర్‌లో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం కాలనీకు చెందిన దుడ్డు వెంకటేశ్వర్లు(35) ఎంఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. అయితే తండ్రి వ్యవసాయ పనులతో కూలీ నాలీ చేసి చదివించినా, ఉద్యోగం సాధించకపోవడంతో మనస్తాపానికి గురైన అతను ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బర్లీసాగు నియంత్రణకు కమిటీ ఏర్పాటు

పంగులూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నల్ల, తెల్ల బర్లీ పొగాకు సాగు నిలవరించడానికి గ్రామస్థాయిలో కమిటీ ఏర్పాటు చేసినట్లల ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు, గ్రామ రెవెన్యూ అధికారి చైర్మన్‌గా, వ్యవసాయ సహాయకులు కన్వీనర్‌గా, గ్రామ కార్యదర్శి, మహిళాపోలీస్ సభ్యులుగా గ్రామాలవారీగా కమిటీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బర్లీ పొగాకు నారుమడులు పోసినా, పంట సాగుచేసినా, దున్నివేయనున్నట్లు కమిటీ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పొగాకుసాగు వలన కలిగే నష్టాలను తెలియచేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలసాగు గురించి వివరించనున్నట్లు తెలిపారు.

పొగాకు నర్సరీలు సాగు చేయొద్దు

అద్దంకి, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):పొగాకు కంపెనీల మాటలు నమ్మి పొగాకు నర్సరీలు సాగు చేయవద్దని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. మండల టాస్కఫోర్స్ సమావేశం శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎర్రాయం మాట్లాడుతూ గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చిందన్నారు. దీంతో ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తోందన్నారు. ఇంకా రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉన్నందున రైతులు ఎట్టిపరిస్థితులలో పొగాకు సాగు చేయవద్దన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో వివిధ శాఖ అధికారులతో టాస్కపోర్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఎస్సై నరసింహ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

బల్లికురవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ పంటలకు సరిపడిన యూరియా అందుబాటులో ఉందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ వ్యవసాయశాఖల తరఫున కమిటీగా ఏర్పాటయ్యి, యూరియా నిల్వలను పరిశీలిస్తున్నామన్నారు. శనివారం మన గ్రోమోర్ కేంద్రంలోని యూరియాను అధికార్ల బృందం పరిశీలించింది. రైతులు ఎవరు పంటల సాగుకు ముందే కొనుగోలు చేసి నిల్వలు చేసుకోవద్దు అన్నారు. అన్ని గ్రామాలలోని సహకార సంఘాలకు ఎరువులను అందజేస్తామన్నారు. అలానే రైతులు బర్లీ పొగాకును సాగు చేయవద్దన్నారు. ఎవరైన నల్ల బర్లీ పొగాకును సాగు చేసిన నారుమడులు పెట్టినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ

అద్దంకిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా అన్ని గ్రామాలల్లో ఎంఆర్‌పీఎస్ జెండాలు ఆవిష్కరించాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేళ్ల శ్రీనుమాదిగ పిలుపునిచ్చారు. ఈ నెల 25న అద్దంకిలోని అంబేడ్కర్ భవనం నుంచి ర్యాలీ, అనంతరం కట్టకిందపాలెంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దాతల సాయాన్ని అందిపుచ్చుకోవాలి



సాయం అందజేస్తున్న సుబ్బారావు

అద్దంకిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దాతలు అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకొని చదువులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్ ప్లస్‌లో అన్నంగి స్రవంతి ఇంటర్‌మీడియట్ పూర్తిచేసి ప్రస్తుతం ఒంగోలులోని నర్సింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దేశీ యూత్ తరఫున కుకట్ల నేహశ్రీ రూ.20వేల ఆర్థికసాయాన్ని అందించగా ఆమె తాతయ్య కూకట్ల సుబ్బారావు చేతుల మీదుగా స్రవంతికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం అందించిన కూకట్ల నేహశ్రీని, కూకట్ల ఫౌండేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పెంట్యాల గంగాధరరావు, కూకట్ల శ్రీనివాస్, వినుకొండ సుధాకర్, ఈశ్వరయ్య, సీఆర్‌పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధైర్యసాహసాలకు చిరునామా ప్రకాశం పంతులు

చీరాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ధైర్యసాహసాలకు చిరునామా టంగుటూరి ప్రకాశం పంతులు అని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణంలో టంగుటూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో తుపాకీకు ఎదురు నిలబడి ఆంధ్రకేసరిగా, ఉక్కుమనిషిగా గుర్తింపు పొందారన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, కూటమి నాయకులు శరత్, భాస్కర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


చీరాలలో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్


చినగంజాంలో నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం : స్వాంతంత్ర సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు చేశారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి తహసీల్దార్, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు, రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను పలువురు కొనియాడారు.. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఇన్‌చార్జ్ ఆర్ఐ బండారు దానియేలు, గ్రామ రెవెన్యూ అధికారులు కే.నాగేశ్వరరావు, ఆమంచి సత్యనారాయణ, పులుగు నాగరాజురెడ్డి, పద్మావతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగించాలని, తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఇంకొల్లులో శనివారం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహిచారు. నాగులచెరువు వద్ద ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఆనంతరం ఆయన చేసిన సేవల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్, ఏపీఎం అనూరాధ, పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : టంగుటూరి ప్రకాశం పంతులు దేశభక్తి, ధైర్య సాహసాలు, త్యాగనిరితి అందరికీ ఆదర్శమని విశ్రాంత న్యాయమూర్తి, విద్యుత్‌శాఖ అంబుడ్స్‌మెన్ గుండ్లాపల్లి వెంకటకృష్ణయ్య అన్నారు. శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక బంగ్లారోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ప్రకాశం పంతులు స్థితప్రజ్ఞతను, పరిపాలనా దక్షతను ధైర్యసాహసాలు, త్యాగనిరితిని గురించి వెంకటకృష్ణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షుడు ఇలపావులూరి శేషతల్పసాయి, గాడేపల్లి దివాకర్‌దత్తు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దేవపాలన, శ్రీనివాసరావు, వీరయ్య, త్రిమూర్తులు, మస్తాన్, రమేష్‌బాబు, మురళీసుధాకరరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

● కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా , న్యాయవేత్తగా ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు చేసిన సేవలు మరువలేనివని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి వెంకటకృష్ణయ్య

ప్రసన్నాంజనేయస్వామికి దశ సహస్ర కదళీఫలార్చన


విశేష అలంకరణలో స్వామివారు

అద్దంకి, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి అమవాస్య సందర్భంగా శనివారం 10 వేల అరటిపండ్లతో పూజ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం నిత్య పూజల అనంతరం పూజారులు స్వామి వారికి 10 వేల అరటిపండ్లతో పూజలు నిర్వహించారు. అనంతరం అరటిపండ్లతో స్వామి వారికి అలంకరించారు. శనివారం కావడంతో పాటు అరటిపండ్ల పూజ నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజలు, వాహనపూజలు, ఇతర పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు కుటుంబసభ్యులతో వచ్చి పొంగళ్ల పెట్టుకొని స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం

అద్దంకిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు గత విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో 550 మార్కులు ఆ పైన మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు ఇలపావులూరి శేషతల్పసాయి, గాడేపల్లి దివాకర్‌దత్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనుమనుమరాలు కేవీఎల్ సుభాషిణి హాజరై విద్యార్థులకు బహుతులు అందజేస్తారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, మిత్రమండలి సభ్యులు అందరు హాజరై కార్యక్రమాని జయప్రదం చేయాలని కోరారు.

కంటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి

● నేత్రవైద్య నిపుణులు డాక్టర్ కిరణ్మయి

పంగులూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):కంటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని విజయవాడకు చెందిన శ్రీనయన కంటివైద్యశాల నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్మయి అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామంలో శనివారం ఉచితకంటి వైద్యశిబిరం నిర్వహించారు. బూదవాడ పరిసర గ్రామాలకు చెందిన 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక నేతలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

చీరాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో విద్యార్థులకు అందించే విద్యాభ్యాస వస్తువులతో ముందుకు సాగాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మానవతా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 120 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష అట్టలు, జామెంట్రీబాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.మురళీ, నాగవీరభద్రాచారి, రామకృష్ణ, బ్రహ్మారెడ్డి, వినయ్‌రాజ్ కుమార్, యలమందరెడ్డి, సుందరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

● ఉపాధి సిబ్బందికి ఎంపీడీవో హెచ్చరిక

బల్లికురవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పనిచేసే సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పాండురంగ స్వామి హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ పనుల వివరాలను సమీక్ష సందర్భంగా చర్చించారు. ఎవరైన గ్రామాలలో బోగస్ మస్టర్లు వేస్తే సహించేది లేదన్నారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జ్ ఏపీవో రమాదేవి పాల్గొన్నారు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఎస్సై వినోద్‌బాబు


అవగాహన కల్పిస్తున్న ఎస్సై వినోద్‌బాబు

పంగులూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఎస్ఐ.వినోద్ బాబు కోరారు. మండలంలోని ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఎయిడెడ్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు శనివారం మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల వినియోగంతో విద్యార్థుల జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. ప్రమాదకరమైన గంజాయి, డ్రగ్స్ సేవించేవారితో పాటు విక్రయించేవారి సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టిసారించాలన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి ఈగల్‌టీమ్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా ట్రోల్‌ఫ్రీ నెంబరు 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు. హెచ్ఎం. పుచ్చకాయల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాపట్ల ఈగల్‌టీమ్ ప్రతినిదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రగతి బాట

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

● పీఎంఏజీవై నిధులు రూ.80 లక్షలు మంజూరు



పర్చూరు, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను ప్రగతిబాటలో నిలపడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ యోజన (పీఎంఏజీవై)లో భాగంగా పర్చూరు నియోజవర్గంలో పలు గ్రామాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ఏలూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 19 పనులకు గాను రూ.80 లక్షల నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ జె.వెంకట మురళి ఉత్తర్వులు జారీచేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల ప్రగతి, సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతులు బలోపేతమే లక్ష్యంగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేలా సీసీ రోడ్డు, డ్రైన్లు ఇతర వసతులు కల్పించేలా చర్యలు చేపట్టనట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభమయ్యేలా అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం భీమవరం గ్రామానికి రూ.20 లక్షలు, యద్దనపూడి మండలం యదనమదల రూ.20లక్షలు, చినగంజాం మండలం సంతరావూరు రూ.20, లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా పర్చూరు మండలంలోని దేవరపల్లికి రూ.20 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అద్దంకి పట్టణ సీఐ సుబ్బరాజు అన్నారు. ఎయిడ్స్ పై ప్రజలలో అవగాహన పెంచేందుకు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అక్టోబరు 12వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. కార్యక్రమంలో ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, పీఎస్సై వెంకటేశ్వరరెడ్డి, దుర్గాభవాని, లక్ష్మీతేజశ్విని, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

చినగంజాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా గురించి ఆందోళన చెందనవసరం లేదని తహసీల్దార్ జే.ప్రభాకరరావు, ఏవో ఆర్.చంద్రశేఖర్‌లు అన్నారు. ఎరువుల కొరత నియంత్రణ, పొగాకు సాగు నిషేధంపై వారు శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రైవేట్ డీలర్లతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో కూడా రైతులకు అవసరమైన యూరియా అందజేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్ టీంగా ఏర్పడి మండలంలోని ఎరువుల దుకాణాలు, ఫ్యాక్టరీలలో తనిఖీలు నిర్వహించి ఎక్కువ మోతాదులో యూరియా ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కడవకుదురు గ్రామంలోని మాధవ ఫర్టిలేజర్స్ దుకాణాన్ని వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్.ఐ విజయబాస్కరరావులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ


విచారణ చేస్తున్న చీరాల డిఎల్‌డీవో పద్మావతి

చినగంజాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులలో జరిగిన అవకతవకలపై చీరాల డీఎల్‌డీవో కే.పద్మావతి శనివారం విచారించారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బేతపూడి సురేష్‌బాబు, తెలుగు యువత పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, టీడీపీ నాయకులు కనపర్తి వీరాస్వామిలు ఈ నెల 4న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు పద్మావతి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కడవకుదురు గ్రామంలో 2021-24 వరకు ఫీల్డ్‌అసిస్టెంట్‌గా కొమ్ము సుబ్బారావు పని చేశారు. సుబ్బారావు భార్య ఆశాజ్యోతి చినగంజాం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోందని, ఆమెను, తనను ఉపాధిహామీ కూలీలుగా చూపిస్తూ నగదు జమచేశారని, ప్రకాశం జిల్లా డీపీవోగా పనిచేసి ప్రసుత్తం తిరుపతి డీఎల్‌డీవో పనిచేస్తున్న జీవీ.నారాయణరెడ్డి తండ్రి రాజగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌ని ఉపాధికూలీలుగా చూపి అక్రమంగా ఉపాధి నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదు చేశారు. నారాయణరెడ్డి తండ్రి రాజగోపాల్‌రెడ్డి 2020 మార్చి 2న మృతి చెందగా, ఆయన బతికే ఉన్నట్లు 2023 సంవత్సరం వరకు ఉపాధిహామీ నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల సమక్షంలో ఆమె విచారించారు. దీనిలో భాగంగా ఉపాధి హామీ రికార్డులు పరిశీలించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.సూమాంజలిని విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఏపీవో లక్ష్మిదేవి పాల్గొన్నారు.

'కోట' పాత్రలతో ఎప్పటికీ నిలిచి ఉంటారు


దివంగత సినీ ప్రముఖులకు నివాళి అర్పిస్తున్న మిత్రమండలి సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దివంగత సినీ నటుడు కోటా శ్రీనివాసరావు తన సినీ పాత్రలతో ఎప్పుడూ జీవించే ఉంటారని చందలూరి నారాయణరావు వివరించారు. శనివారం సాయంత్రం చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభామూర్తుల సభ ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల నటులు కుందుర్తి శీతారామశాస్త్రీ మాయల పకీర్ ఏకపాత్రభినయం చేశారు. కార్యక్రమానికి షేక్ మస్తాన్ ఆర్థిక సహకారాన్ని అందించారు. శ్రీరామ వృద్ధుల ఆశ్రమ స్థాపకులు రావూరి రంగయ్యను సంఘసభ్యులు సేవారత్న పురస్కారంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, ఆర్‌వీ రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫర్‌ను వినియోగించుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆజాదీ కా ఆఫర్ పథకంలో భాగంగా రూ.1కే ఉచిత సిమ్, 2జీబీ డేటాతో 30 రోజుల ఉచిత కాల్స్‌ను బీఎస్ఎన్ఎల్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సీ. అమరేంద్రరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ఈనెలాఖరు వరకు అమలు ఉంటుందని తెలిపారు. ఈ పథకం కింద ఆంధ్రా సర్కిల్‌లో ఇప్పటివరకు 96వేల మంది వినియోగదారులు లబ్ధిపొందారని ఆయన వివరించారు. జిల్లాలో 4,300 మంది ప్రయోజనం పొందారని తెలిపారు. జాతీయస్థాయిలో రాష్ట్రం 2వస్థానం సాధించిందని ఆయన పేర్కొన్నారు.



మెగా డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల కావడంతో అభ్యర్థుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపింది. ఏళ్ల తరబడి ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా సన్నద్ధమవుతున్న వారికి మెరిట్ జాబితా విడుదల ఊరట నిచ్చింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి. డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ఏళ్లతరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగులు సంబరాల్లో మునిగిపోయారు. పలు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంతో సోమవారం నుంచి జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నద్ధమవుతున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

మెగా సంబరం

- డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల
- జిల్లావాసులకు ఉత్తమ ఫలితాలు
- నిరుద్యోగుల్లో వెల్లివిరిసిన ఆనందం

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి డీఎస్సీలో వయోపరిమితి పెంచడంతోపాటు క్రీడా కోటాలోనూ వెయిటేజీ పెంచారు. ఇవన్నీ నిరుద్యోగులకు కలిసివచ్చే అంశాలు కాగా వయోపరిమితి పెంపుతో ఎంతోమంది అవకాశం కూడా లభించనుంది. జిల్లావ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేయనుండటంపై అభ్యర్థులంతా రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు. జిల్లాలో మెగా డీఎస్సీ-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లను జూన్ 6 నుంచి 30వతేదీ వరకు ఉమ్మడిజిల్లాలోని 8 కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 31,221 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు తెలిపారు.

● అత్యధిక స్కోర్ వీరికే..

డీఎస్సీ మెరిట్ జాబితాలో పలువిభాగాల్లో అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎస్ఏ (ఇంగ్లీష్)లో జి.మోహన వెంకట సతీష్ 88.13 స్కోర్, ఎస్ఏ (హిందీ)లో సయ్యద్ షబ్‌నాజ్ 84.65, ఎస్ఏ(తెలుగు)లో ఎం.శ్రీకాంత్ 90.15, ఎస్ఏ(ఉర్దూ)లో షేక్.గయాజుద్దీన్ 86.33, ఎస్ఏ(బయలాజికల్ సైన్స్)లో సీహెచ్.వెంకటరెడ్డి 85.36, ఎస్ఏ (మ్యాథ్స్)లో డి.నాగసాయి శరత్‌ఫణీంద్ర 84.30, ఎస్ఏ(పీఈ)లో ఆర్.సాయికోటి 93, ఎస్ఏ(ఫిజికల్ సైన్స్)లో ఎల్.వినయ్‌కుమార్ 87.87, ఎస్ఏ (సోషల్)లో ఎం.బాబు 85.02 స్కోర్‌లతో అగ్రస్థానంలో నిలిచారు. అలాగే ఎస్‌జీటీ విభాగంలో షేక్.నాయబ్ రసూల్ 94.51, ఎస్‌జీటీ (ఉర్దూ)లో సయ్యద్ రిజ్వాన్ అలిషర్ 57.77స్కోర్‌లతో మొదటిస్థానం సాధించారు.

● రేపటి నుంచి పత్రాల పరిశీలన

అర్హుల జాబితాలో ఉన్న అభ్యర్థుల పత్రాలను సోమవారం నుంచి పరిశీలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. నగరంలోని వైఎంసీఏ మైదానంలోని వీఆర్ పీజీ కళాశాలలో జరిగే పరిశీలనకు ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు బీసీ, సాంఘీక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి వీటిలో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉందని, లేని పక్షంలో 25నే పరిశీలన ఉంటుందని స్పష్టం చేశారు. మెరిట్ లిస్ట్ జాబితాను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్‌లెటర్ అందిస్తామన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్‌ల జెరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరు కావాలన్నారు. అలాగే వెరిఫికేషన్‌కు ముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పరిశీలనకు అభ్యర్థి హాజరు కాకపోయినా, సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా తగిన విద్యార్హతలు లేకపోయినా మెరిట్ లిస్ట్‌లోని తరువాత వారికి అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు.

దళారుల మాట నమ్మొద్దు

ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మవద్దని డీఈఓ తెలిపారు. కొంతమంది సోషల్ మీడియా వేదికగా, అసత్య వదంతులు వ్యాప్తి చేస్తూ అభ్యర్థులను ఆందోళనకు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటివి నమ్మి మోసపోవద్దని, వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న ప్రకటనలు, నోటిఫికేషన్‌లు, ఫలితాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

పట్టుబట్టి.. కొలువు కొట్టి...



అన్నదమ్ములు నస్రుల్లా, సిగ్బతుల్లా



మూడు ఉద్యోగాలు సాధించిన పులిమి శ్రీతేజ

ఉదయగిరి : మెగా డీఎస్సీ మెరిట్ జాబితాలో ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు తమ సత్తా చాటి ఉద్యోగాలు సాధించారు. సున్నంవారిచింతల గ్రామానికి చెందిన పులిమి శ్రీతేజ డీఎస్సీలో మూడు ఉద్యోగాలు సాధించింది. స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో జిల్లాస్థాయిలో 82.11 మార్కులు సాధించి 4వ ర్యాంకు, టీజీటీ జోనల్-3 స్థాయిలో 73.20 మార్కులు సాధించి 17వ ర్యాంకు, ఎస్‌జీటీ చిత్తూరు జిల్లా నాన్‌లోకల్ కింద 86.92 మార్కులతో 33వ ర్యాంకు సాధించింది. అలాగే ఉదయగిరిలోని దిలావర్‌భాయ్‌వీధికి చెందిన అన్నదమ్ములైన షేక్ నస్రుల్లా ఎస్ఏ ఇంగ్లీష్ సబ్జెక్టులో 57వ ర్యాంకు, షేక్ సిగ్బతుల్లా జోన్-3 పీఈటీ బీసీ-ఈ విభాగంలో 1వ, జనరల్ కేటగిరీలో 179వ ర్యాంకులు సాధించి కొలువు కొట్టారు. కాగా వీరిలో నస్రుల్లా ప్రస్తుతం దుత్తలూరు మండలం వెంకటంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీటీగా పని చేస్తున్నారు.

ఫలించిన 'స్వప్న'ం



పొదలకూరు : ఒకరు ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనం అవుతున్న నేపథ్యంలో ఆమె హిందీలో మూడు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరంతర శ్రమ, పట్టుదలతో తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. పొదలకూరు మండలం చెర్లోపల్లికి చెందిన తిరుమూరు స్వప్న విజయ గాథ ఇది. 2018 డీఎస్సీలో కేవలం ఒక్క మార్కుతో ఉద్యోగం చేజారిపోయింది. అయినా ఆమె నిరాశపడలేదు. పట్టుదలతో చదివి 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ హిందీలో జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు, పీజీటీలో 2వ ర్యాంకు, టీజీటీలో 5వ ర్యాంకు సాధించారు. మొత్తం మూడు కేటగిరీల్లో ఉద్యోగాలు కైవశం చేసుకున్నారు.తన శ్రమతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, సైకాలజీ టీచర్ వేణు సలహాలు, సూచనలు తాను 3 ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడ్డాయని స్వప్న తెలిపారు.

ఆత్మకూరులో..



అన్నదమ్ములు షేక్ అజహరుల్లా, అతహరుల్లా

ఆత్మకూరు : పట్టణంలోని ఇద్దరు సోదరులు ఎస్‌జీటీలో 5, 17వ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపకయ్యారు ఉలవదిబ్బకు చెందిన షేక్ అజహరుల్లా, అతహరుల్లా ఇద్దరు సోదరులు. తండ్రి షేక్ జిలానీ. ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కష్టపడి చదివి తండ్రిలాగే ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. ఆ మేరకు కష్టపడి డిగ్రీ, బీఈడీ చేశారు. శిక్షణ పొంది డీఎస్సీ రాశారు. అజహరుల్లా 90.63519, అతహరుల్లా 89.07814 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 5, 17వ ర్యాంకులు సాధించారు.



కానిస్టేబుళ్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు శనివారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించారు. జిల్లాలో మొత్తం 243 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉండగా, 235 మంది హాజరయ్యారు. ఎనిమిదిమంది హాజరు కాలేదు. సివిల్‌లో 142 మందికి 137 మంది, ఏపీఎస్పీలో 101 మందికి 98 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికెట్ల కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా అధికారులు పరిశీలించారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ మాట్లాడుతూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు భవిష్య త్తులో క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో చంద్రమౌళి, సూపరింటెండెంట్ సురేష్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

7.6 లక్షల మంది అతివలకు ఉచిత ప్రయాణం

● తొలివారంలో రూ.2.9 కోట్ల లబ్ధి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం ప్రారంభమైన తొలివారంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా 7,64,311 మంది మహిళలు ప్రయాణించారని జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన పథకం ప్రారంభమవగా 22వ తేదీ వరకు పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి మూడు రకాల బస్సులలో 14,88,537 మంది ప్రయాణించారు. వీరిలో 7.6 లక్షల మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వారం రోజుల్లో మహిళలకు రూ.2,91,98,935 మేర ఈ పథకం ద్వారా లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు.

కొత్త కార్డులు వచ్చేశాయ్!

- జిల్లాకు చేరిన 7,10,990 రేషన్‌కార్డులు
- రేపటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్త కార్డుల కోసం కొందరు.. ఉన్న కార్డులలో మార్పు, చేర్పుల ఇంకొందరు చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో కార్డులు కోసం దరఖాస్తు చేసినా ఫలితం లేకుండా పోయింది. కనీసం కార్డులలో మార్పు, చేర్పులు కూడా జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అధికారిక ముద్రతో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డు లను ఇస్తామని ప్రకటించింది. అన్న మాట ప్రకారం ఈ నెల 25 నుంచి ఆ కార్డులను పం పిణీ చేయనుంది. ఆధునిక సాంకేతతో రూపుదిద్దుకున్న ఈ కార్డులలో బయోమెట్రిక్ డేటా, క్యూ ఆర్ కోడ్ వంటి ప్రత్యేకలు ఉన్నాయి. లబ్ధిదారులు ఎక్కడనుంచైనా సులభంగా రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉంది. ఏటీఎం కార్డు సైజ్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్‌కార్డులు ప్రభుత్వం ఇవ్వనుండటంతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

● 7,10,990 కార్డులు

జిల్లాకు 7,10,990 స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, వాటిని తహసీల్దారు కార్యాలయాలకు పంపారు. సచివాయానికి చెందిన ఓ ఉద్యోగి సంబంధిత ప్రాంతంలోని డీలర్ ద్వారా లబ్దిదారులకు స్మార్ట్ కార్డులు అందచేస్తారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతి కార్డుదారు ఇంటికి వెళ్లి కార్డులను ఇస్తారు. సెప్టెంబరు 1న రేషన్ పంపిణీ మొదలవుతుంది. ఈపాస్ మిషన్ ద్వారా కార్డుదారు వేలిముద్ర తీసుకుని ఆన్‌లైన్ పద్ధతిలో స్మార్ట్ కార్డులు అందచేస్తారు. కాగా, మే 7వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం, కార్డులలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఆ తర్వాత అధికా రుల పరిశీలన, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 25న స్మార్ట్ రేషన్‌కార్డులు అందచేస్తామని ప్రకటించిన తర్వాత కూడా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. కాగా, ఇప్పటి దాకా వరుసగా ఆర్నెల్లపాటు రేషన్ తీసుకోని వారికి కొత్తకార్డులు ఇవ్వరు. తమకు కార్డులు రాలేదని అధికారులకు తెలిపితే వారి విషయం పరిశీలించి కార్డులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటారు.



కొత్త స్మార్ట్ రేషన్ కార్డు ఇదే..


రేపటి నుంచి పంపిణీకి సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఈ కార్డులను పంపిణీ చేస్తారు.



- ఎన్.విజయకుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల వివరాలు	
వచ్చిన దరఖాస్తులు	71,808
కార్డుల్లో అడ్రస్‌ల మార్పు	1,986
వివరాల మార్పు	354
ఆధార్ సీడింగ్ సవరణ	1,318
చౌకధరల దుకాణాల రెన్యువల్	21
పేర్లు చేర్చడానికి	49,140
పేర్లు తొలగించడానికి	1,846
కొత్తకార్డుల కోసం	9,771
కార్డుల విభజన కోసం	7,334
ప్రభుత్వానికి సరెండర్ చేసినవి	38



ఎందెందు వెతికినా అంతా రౌడీలేనయ్యా!

నెల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేకించి నెల్లూరులో శాంతిభద్రతల పరిస్థితి రౌడీషీటర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారిపడి ఉంది. రౌడీమూకలు దయతలిస్తే పరిస్థితులు ప్రశాంతంగా ఉంటాయి. లేదంటే దాడులు, హత్యలు కొనసాగుతాయి. ప్రశాంతతకు మారుపేరు అయిన జిల్లాలో గడిచిన ఆరేళ్లగా ఇదే పరిస్థితి. వైసీపీ హయాంలో ప్రజాప్రతినిధుల పక్కన రౌడీలే.., పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు నడిపేది వారే, రోడ్డుకిరువైపులా కటౌట్లలోనూ వారి ముఖాలే, సామాన్యులకు తరచూ ఎదురయ్యే బెదిరింపుల్లోనూ వారే, హత్యల వెనుక వారే, గంజాయి విక్రయాల్లోనూ వారే చక్రం తిప్పారు. రౌడీలు పక్కన పెట్టుకొని తిరగడం ఫ్యాషన్‌గా భావించిన కొంతమంది నాయకుల పుణ్యమా అని ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో రౌడీయిజం మూడు కత్తులు.. ఆరు పోట్లుగా వర్ధిల్లింది. జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి జైలు లోపలి నుంచే నేర సామ్రాజ్యాన్ని నడిపించే స్థాయికి ఎదిగాడంటే, ఒక సాధారణ మహిళ రౌడీ గ్యాంగ్‌స్టర్‌గా సెటిల్‌మెంట్లు చేసే స్థాయికి చెలరేగిందంటే ఇందులో రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల పాపం సమాన భాగాల్లో ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది. బాధాకరం ఏమిటంటే హైదరాబాద్ పాతబస్తీలో అరాచకశక్తులను ఉక్కుపాదంతో అణిచేసిన చరిత్ర కలిగిన తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా శాంతిభద్రతల విషయంలో ఎంతటి వారినైనా సరే ఉపేక్షించని నైజం కలిగిన చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తున్నా జిల్లాలో పరిస్థితి మెరుగుపడకపోవడం దురదృష్టకరం.

● ఫ్యాషన్‌గా మారిన రౌడీయిజం

రాజకీయ నాయకుల పుణ్యమా అని జిల్లాలో రౌడీయిజం ఫ్యాషన్‌గా మారిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇది మరింత ప్రబలిపోయింది. డివిజన్‌కు ఒక కార్పొరేటర్ ఉన్నట్లు, వార్డుకు ఒక కౌన్సిలర్ ఉన్నట్లు ఒక్కో వీధికి ఒక్కో రౌడీ తయారయ్యాడు. రాజకీయ నాయకులు వీరికి ప్రత్యేకమైన గౌరవం ఇవ్వడంతో ఇది చూసిన యువకులు రౌడీయిజం పట్ల ఆకర్షితులయ్యారు. దీంతో గడిచిన ఆరేళ్ల కాలంలో రౌడీషీటర్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా 982 మంది రౌడీషీటర్లు ఉండగా నెల్లూరు నగరంలో మాత్రం 480 మంది ఉన్నారు. అంటే డివిజన్‌కు పది మంది చొప్పున రౌడీ షీటర్లు ఉన్నారన్నమాట.

వేళ్లూనుకొంటున్న గ్యాంగ్‌ల సంస్కృతి



సమాజంలో అక్కడక్కడా నేరప్రవృత్తి కలిగిన వారు ఉండటం సహజం. వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేయడం సహజం. రౌడీషీటర్ అయినంత మాత్రానా ఎప్పుడూ రౌడీయిజంతోనే బతుకుతాడని కాదు. వీరి నేరాలు ఒకటి రెండింటికి పరిమితమై ఉండవచ్చు. లేదా ప్రస్తుతం నేర ప్రపంచానికి దూరంగా జీవిస్తూ ఉండవచ్చు. ఇలాంటి వారితో ప్రమాదం లేదు. కానీ గత కొన్నేళ్లుగా నేరాలనే వృత్తిగా చేసుకొని గ్యాంగ్‌లు తయారయ్యాయి. ఇద్దరు, ముగ్గురు రౌడీలు ఒక గ్యాంగ్‌గా ఏర్పడటం, వారికి ఒకరు నాయకత్వం వహించడం, ఈ గ్యాంగ్‌స్టర్‌కి ఒక రాజకీయ నాయకుడు అండగా నిలబటం ఎక్కువైపోయింది. రాజకీయ నాయకులు సంపాదనే ధ్యేయంగా భూ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో వీరికి రౌడీల అవసరం ఏర్పడింది. రౌడీలను ముందు పెట్టుకొని సెటిల్‌మెంట్లు చేసే సంస్కృతి వేళ్లూనుకొంటోంది. రాజకీయ నాయకుల కోసం రౌడీలు దందాలు చేస్తున్నారు. రౌడీల కోసం రాజకీయ నాయకులు పోలీస్ శాఖను ప్రభావితం చేస్తున్నారు. వెరసి జిల్లాలో రౌడీయిజం గ్యాంగ్‌ల స్థాయికి విస్తరించింది.

● 2వేల మందిపై సస్పెక్టెడ్ షీట్లు

నేర ప్రవృత్తి కలిగిన వారిని గుర్తించి వారిపై సస్పెక్టెడ్ షీట్లు తెరుస్తారు. అంటే వీరు రౌడీషీటర్ల కన్నా తక్కువేమీ కాదు. నేర ప్రవృత్తిలో వారికన్నా వీరే ప్రమాదకరం. రాజకీయ జోక్యం, పోలీసు శాఖలో అవినీతి లేకుండా నిష్పక్షికంగా వ్యవహరించి ఉంటే వీరిలో చాలా మందిపై ఇప్పటికే రౌడీ షీట్లు ఓపెన్ చేసి ఉండాల్సింది. అయితే రాజకీయ నాయకులు వీరిని కాపుకాయడంతో చాలా మందిపై రౌడీషీట్లు తెరవలేదు.

● ఇకనైనా మేలుకొంటారా!?

జీవితఖైదీ శ్రీకాంత్, ఈయన ప్రియురాలు అరుణల వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. దీంతో నిన్న మొన్నటి వరకు అచేతనంగా ఉన్న పోలీసు శాఖలో కదలిక వచ్చింది. జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్ల భరతం పట్టడానికి ఉపక్రమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ స్థాయిలో నెల్లూరు జిల్లాపై దృష్టి సారించారు. రౌడీమూకలను కట్టడి చేసే పనులు మొదలవుతున్నాయి. అయితే ఇవి ఎంతవరకు రౌడీమూకల్లో భయాన్ని కలిగిస్తాయి, ఎంతవరకు వారి నేరప్రవృత్తిని మార్చగలుగుతాయి అనేది పోలీసు వ్యవహారశైలి మీద ఆధారపడి ఉంది.

చికెన్ ధరలు	నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్
	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
కోడిగుడ్ల ధర (100): 535	

మాలకొండ ఆదాయం రూ.6,95,873

వలేటివారిపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొం డ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.6,95,873 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లకు రూ.8,050, కుంకుమార్చ నకు రూ.18,520, తలనీలాలకు రూ.28 వేలు, వాహనపూజలకు రూ.2,260, ప్రత్యేకదర్శన టిక్కెట్లకు రూ.2,01000, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.840, రూము అద్దెలకు రూ.24,150, కవర్లు ద్వారా రూ. 9,825, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,17,055, అన్నదానం ద్వారా రూ. 1,76,173, విరాళముల ద్వారా రూ. 10 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలో ఈనెల 25వ తేదీ నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుంచి 31 వరకు సంబంధిత సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి వారి ఐరిష్, ఫేస్ రీడర్, ఓటీపీ ద్వారా ధ్రువీకరించి కార్డు అందజేస్తారన్నారు. మిగిలిన కార్డులను సెప్టెంబరు 1 నుంచి 15 తేదీ వరకు సంబంధిత రేషన్ షాపు డీలర్లు వద్ద పొందవచ్చన్నారు. ఇంకా మిగిలి ఉంటే అటువంటి వారికి సెప్టెంబరు 16 నుంచి 20వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఈ విషయంపై ఏమైనా సందేహాలు ఉంటే గ్రామ రెవెన్యూ అధికారి, రేషన్ డీలర్లను సంప్రదించాలని కోరారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎపిట్ పరిశోధన ప్రయోగశాల, అర్బన్ స్మార్ట్‌ల ఆధ్వర్యంలో స్మార్ట్ డ్రోన్స్ అభివృద్ధిపై నిర్వహించిన ఆరురోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఆయా సంస్థల నిపుణులు కె.ప్రశాంత్, డి.విలియమ్, ఎండీ మహమ్మద్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రోన్ రూపకల్పన, వస్తు అంతర్జాలం అన్వయాలు, కృత్రిమ మేధ వినియోగంపై శిక్షణనివ్వగా ఈసీఈ విద్యార్థులు ఎంతో నైపుణ్యం ప్రదర్శించటం హర్షనీయమని పేర్కొన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, హెచ్‌ఓడీ జీ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ అంతరిక్ష దినోత్సవం

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక విట్స్ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ముగిసింది. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐఐఎస్సీ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ ఐవీ మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పోస్టర్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ అబ్బురపరిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ విజయ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లింగసముద్రం ఎస్‌ఐ ఎం.నారాయణ చెప్పారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఆయన సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, గంజాయి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహ్మద్ హప్తార్ పాల్గొన్నారు.

నేడు రాములోరి తిరుణాళ్ల

కావలిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగయ్యగారిపాలెంలో ఆదివారం రాములవారి తిరుణాళ్ల నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ట్రైన్ ఢీకొని యువకుడి మృతి

ఉలవపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో కావలి వైపు వెళ్లే ట్రాక్‌పై ట్రైన్ ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. గత వారం రోజులుగా ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలు అమర్చేందుకు 15 మంది యువకులు అనకాపల్లి నుంచి వచ్చారు. ఈ క్రమంలో వారిలోని 22 ఏళ్ల యువకుడు శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, వెతికే క్రమంలో రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైల్వే గేట్ మూత పొడిగింపు

బిట్రగుంట : బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 ట్రాక్‌వర్కులో భాగంగా ఈ నెల 24 వరకు తాత్కాలికంగా మూసి వేసిన గేటును మరో ఐదు రోజులు పొడిగించినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

శివారు ప్రాంతాల్లో సమస్యల తిష్ఠ!

● మున్సిపాలిటీలో విలీనమై 15 ఏళ్లైనా ప్రగతి శూన్యం ● అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్న గ్రామాలు ● అవస్థలు పడుతున్న ప్రజలు



కమ్మవారిపాలెంలో దుర్భరంగా ఉన్న రోడ్డు

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ శివారు ప్రాంతాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. మున్సిపాలిటీలో కలసి 15 ఏళ్లు దాటినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో మునుపటి కంటే అధ్వానంగా మారడం, అడుగడుగున ఎదురవుతోన్న సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడుతోన్నారు. ప్రధానంగా మునునూరు బుడంగుంట, మద్దూరుపాడు, పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక ఇక్కడి ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ముసునూరు, బుడమగుంట, మద్దూరుపాడు ప్రాంతాలు గతంలో పంచాయతీలుగా ఉండేవి. వీటిని పట్టణంలో విలీనం చేసి 15 ఏళ్లు అవుతున్నప్పటికీ అనేక సమస్యలతో పల్లెటూరి వాతావరణమే కనిపిస్తోంది. శివారు ప్రాంతాలు ఎక్కడ చూసిన బురదమయంగా ఉండే మట్టి రోడ్లు, డ్రైన్‌లు లేక మురుగుతో నిండిన రోడ్లు, అడవిని తలపించే చిల్ల చెట్లు పిచ్చిమొక్కలు, నీటి సమస్యతో ఇళ్లముందు నీటి డ్రమ్ములు దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు పాములు, కుక్కలు, పందులు, దోమల బెడదతో ఆయా ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

● మట్టి రోడ్లు, డ్రైన్ సమస్యలు

శివారు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టక పోవడంతో నాలుగు చినుకులు పడితే రోడ్లన్నీ చిత్తడై గుంతలమయంగా మారి కాలు కింద పెట్టలేని పరిస్థితి. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో డ్రైన్ సమస్య పట్టిపీడిస్తోంది. మట్టి రోడ్ల పరిస్థితి ఒక పక్క.. నిర్మాణమైన సీసీ రోడ్లు కూడా డ్రైన్లు లేక మురుగంతా రోడ్లపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మట్టి రోడ్లపై మురుగు దృశ్యాలు చూస్తే ఈ ప్రాంతాలు పట్టణంలోనివేనా అన్న అనుమానం కలుగకమానదు.

● వెంటాడుతున్న విద్యుత్ సమస్య

40 ఏళ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరుకున్న పాత స్తంభాలు చిన్నవి కావడం, తీగలు రోడ్లకు అడ్డంగా నివాసాలపై వాలిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కిందగా ఉండి వాటిచుట్టూ మొక్కల తీగలు అల్లుకుని నిరంతరం షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం సర్వసాధారణమైపోయింది.

● మంచినీటి సమస్య..

మునునూరు బుడమగుంటలో, ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రత అంతాఇంతా కాదు. అనేక ప్రాంతాల్లో మున్సిపాలిటీ వారు వాటర్ ట్యాంకర్లతో రెండురోజుల కొకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ రాకపోతే అంతే సంగతులు. తాగునీటికైతే ఆర్థిక స్థోమత ఉన్నా లేకపోయినా వాటర్ బబుల్స్ కొనుగోలు చేసుకోకతప్పదు. శివారు ప్రాంత ప్రజలకు ఆశలు రేపిన అమృత్ పథకం అర్ధాంతరంగా ఆగిపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదరు.



మునునూరు తూర్పువడ్డిపాలెంలో సీసీ రోడ్డుపై మురుగు



అడవిని తలపిస్తున్న మునునూరు రైస్‌మిల్లు రోడ్డు

● పందులు, కుక్కలు, కోతులు, పాముల బెడద

శివారు ప్రాంతాలు కావడం.. చిల్లచెట్లు. పిచ్చి మొక్కలు అడవిని తలపించేవిధంగా పెరగడంతో విష కీటకాలు (పాముల) బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు, కోతుల సమస్యతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు రోడ్లపై వెళుతున్న పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. కొన్ని రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. బురదమయంగా ఉండే మట్టి రోడ్లు డ్రైన్లు లేక రోడ్లపై చేరే మురుగులో లార్వా ఉత్పత్తి జరిగి దోమల సమస్య తీవ్రంగా వెంటాడడమేకాక దోమ కాటుకు గురై రోగాలు, విష జ్వరాలు బారిన పడుతున్నారు. ఇంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

● టీ.ప్రసాదరావు, ఏపీఎం, అల్లూరు

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా శ్రమిస్తున్నాం. మండలంలో మహిళలు తీసుకున్న పొందుపు రుణాలను వినియోగించుకోవడం, తిరిగి చెల్లించడం సజావుగా సాగుతోంది. మండలంలోని సంఘబంధాల మహిళలు పొదుపు చేసే ప్రతీ రూపాయి వారి ఉన్నతికే ఉపయోగపడుతుందని ఏపీఎం టీ.ప్రసాదరావు తెలిపారు.

? మండలంలో ఎన్ని పొదుపు సంఘబంధాలు ఉన్నాయి. ఎంతమంది సభ్యులు ఉన్నారు.

! మండలంలో 38 సంఘబంధాలు ఉండగా వాటిల్లో 1218 పొందుపు గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో మొత్తం 12,864 మంది సభ్యులు మండల సంఘమిత్రగా ఏర్పడి ఉన్నారు.

? పొదుపు గ్రూపులకు ఈ ఏడాది బ్యాంకర్లు ఎంత రుణం మంజూరు చేశారు.

! ఇప్పటి వరకు రూ.10.56 కోట్ల రుణాలు మంజూరు చేయించి ఉన్నాము. ఈ ఏడాది ప్రభుత్వం మైక్రో క్రెడిట్ ప్లాన్ అనే నూతన పద్ధతిని తీసుకొచ్చి బయోమెట్రిక్ ద్వారా ముందుగా గ్రూపు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచి వాటిని సీసీలతోపాటు మేము కూడా ధ్రువీకరించి బ్యాంకర్లకు పంపితేనే రుణం మంజూరు జరుగుతుంది.

? రికవరీ ఎలా ఉంది. స్త్రీనిధి రికవరీలో సమస్యలు ఉన్నాయా.

! పొదుపు గ్రూపుల రుణాల రికవరీ 99 శాతం ఉంది. దీనిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. స్త్రీ నిధి రుణాలు మాత్రం గతంలో రికవరీ మందకొడిగా ఉండేది. కానీ ప్రస్తుతం రూ.78 లక్షలకు గాను రూ.56 లక్షలు రికవరీ చేశాం. త్వరలో నూరు శాతం రికవరీకి కృషి చేస్తాం.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● స్వచ్ఛభారత్ ర్యాలీలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. శనివారం జలదంకి హైస్కూల్ విద్యార్థులు, అధికారులతో కలసి స్వచ్ఛభారత్-స్వచ్ఛదివస్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు మీదుగా గ్రామ పరువీధుల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో ఉపసర్పంచు కూరపాటి మాలకొండారెడ్డి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి నివాళి

మండలంలోని కర్కోలువారిపాలెంకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాగంటి మాధవరావు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, గట్టుపల్లి టీడీపీ నేత కొల్లా కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జలదంకి పీఏసీఎస్ చైర్మన్ కరియావుల అప్పలయ్యనాయుడు, సభ్యులు జానీ, మధుసూదనరెడ్డిలు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను వింజమూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కావలి : రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కావలిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కృత్రిమ కొరత సృష్టించి ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వింజమూరు ఏడీఏ శేషగిరి పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. రికార్డులు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి లలిత, విజిలెన్స్ అధికారులు శ్రీహరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉలవపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉలవపాడు, కరేడు, భీమవరం గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కావలి ఏడీఏ నాగరాజు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఆయా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్స్ అధికార పత్రాలు (ఓ-ఫారమ్) లేకుండా అక్రమంగా అమ్ముతున్న రూ.2,30,000 విలువ కలిగిన ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, నిర్ణయించిన ధరకు మించి విక్రయించకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులపై 6ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం సీజ్ చేసిన ఎరువులకు సంబంధించిన సరైన పత్రాలు వారంలో సమర్పించాలని, లేని పక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఏడీఏ వెంట ఉలవపాడు, కందుకూరు ఏవోలు విజయ్‌కుమార్, అబ్దుల్ రహీమ్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కలిగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, పురుగమందులు రైతులకు విక్రయించకుండా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి షేక్.జహీర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అదేవిధంగా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు వ్యవసాయ అధికారి వాసు. సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరుణాళ్ల ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండ లం ముంగమూరు పంచాయతీ పేటలోని పోలేరమ్మ తిరునాళ్లు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాభిషేకాల్లో భక్తులు పాలొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్ల బండ లాగు పోటీ లను ముంగమూరు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు యన్నాబత్తిన వెంకటే శ్వర్లు ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 9 జట్లు పోటాపోటీగా బండ లాగి బలప్రదర్శణ చేశాయి. బాపట్ల జిల్లా చుం డూరుకు చెందిన రాములమ్మ ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.70 వేల, సూర్యాపేటకు చెందిన సురేంద్ర రెడ్డి ఎడ్లు రెండో స్థానంలో నిలిచి రూ.60 వేల, మైదుకూరుకు చెందిన వెంకటేశ్వర్లు ఎడ్లు మూడో స్థానంలో రూ. 50 వేల గెలుపొందాయి. గ్రామ పెద్దలు నగదు బహుమ తి ప్రదానం చేశారు.



బండలాగుతున్న ఎడ్లు

మాణిక్యరావు శతజయంతి ఉత్సవాల ప్రారంభం



మాట్లాడుతున్న గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ ఉద్యోగుల పాలిట దైవం మాణిక్యరావు అని గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్ పేర్కొన్నారు. జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో జేబీ అధ్యాపక సంఘం, ఎంజేఎం మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జేబీ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, మాణిక్యరావు కుమారుడు డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ముందుగా విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంజె మాణిక్యరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాణిక్యరావు జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుతులు అందించారు. ఈ కార్యక్రమంలో జేబీ కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, విశ్రాంత అధ్యాపకుడు చెంచయ్య పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి ఘన నివాళి



కందుకూరులో ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టరు హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా శనివారం కందుకూరులో ఘన నివాళులర్పిం చారు. ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న ప్రకాశం పంతులు కాంశ్యవిగ్రహం వద్ద సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులు గా పాల్గొని విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌లో శనివారం మూడుపూటలా పేదలకు ఉచిత ఆహారం ఏర్పాటు చేశారు. ఆంధ్రకేసరి సేవాసమితి అధ్యక్షుడు మంచిరాజు మురళి అ ధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పగుంట నాగరాజారావు, ఐవీ సుబ్రహ్మణ్యం, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్, టీడీపీ నాయకుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకుడు గట్టమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ప్రకాశం పంతులు జయంతి

కావలి(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం కావలిలో నిర్వహించారు. కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించగా ఆర్డీవో కార్యాల య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో పాతూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థ లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణసంఘాల నేతలు కళాధరరావు. పీ.ప్రసాద్, గంగుల చంద్రశేఖర్, నందనవనం మధు, ప్రకాష్‌రావు, రాజేంద్ర కుమార్, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

షార్టు సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెం పాముల కాలనీఁకి చెందిన గురునాథం యేసుకు చెందిన పూరిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటనలో పర్నీచర్, నిత్యావసరాలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్వో మౌనికలు శనివారం గ్రామానికి వెళ్లి కాలిన ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వారికి నివేదిక అందజేస్తామన్నారు. బాధితునికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

టిప్పరు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టిప్పరు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన అల్లూరులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. ఈపూరి నాగరాజు వాటర్ ట్యాంక్ సెంటర్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా మట్టి లోడ్‌తో కావలి నుంచి నెల్లూరు వైపుకు వెళ్తున్న టిప్పరు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనతో తీవ్ర రక్తగాయాలైన నాగరాజును చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మట్టి తో ఆ మార్గంలో వెళ్తున్న మూడు టిప్పర్లను అదుపు లోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం



ఏపీమోడల్ స్కూల్ ఎదురుగా లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మధు

కలిగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో అనధికారికంగా వేస్తున్న లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో వెలుగోటి మధు పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం ఎదురుగా అనుమతులు లేకుండా లేఅవుట్లను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై శనివారం లేఅవుట్‌ను పరిశీలించారు. నుడా ముసుగులో తమకు అనుమతులున్నాయంటూ ఎటువంటి ఫోన్ నెంబరు లేకుండా డెవలపర్స్ పేర్లతో సోషల్ మీడియా ద్వారా బ్రోచర్లను వైరల్ చేస్తూ అమ్మకాలు సాగిస్తే సహించేది లేదన్నారు. పంచాయతీ అనుమతులతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకొని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్లను మాత్ర మే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు.

అపెస్సా జిల్లా కార్యదర్శిగా రమేష్‌సింగ్ ఎన్నిక



కావలి ఏఎస్‌వో రమేష్‌సింగ్

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినేషన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కావలి ఏఎస్‌వో రమేష్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక శనివారం నెల్లూరులో జరిగింది. ఆ ఎన్నికలలో జిల్లా కార్యదర్శిగా రమేష్‌సింగ్‌ను ఎంపిక చేయడంతో కావలిలో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. రమేష్ సింగ్ గతంలో రెండు పర్యాయాలు వింజమూరు ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కావలి రూరల్/జలదంకి/లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కావలిరూరల్ సీఐ రాజేశ్వరరావు, జలదంకి ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా, లింగసముద్రం ఎస్ఐ ఎం.నారాయణలు తెలిపారు. శనివారం వారు ఆయా పోలీసు స్టేషన్లలో మాట్లాడుతూ మండపాల రక్షణ వినాయక విగ్రహ కమిటీ సభ్యులదేనని, పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తరువాత వచ్చే క్యూఆర్‌కోడ్ ప్రింట్‌ను మండపం వద్ద అంటించాలన్నారు. క్యూఆర్‌కోడ్ వచ్చిన అనంతరం పోలీసులను సంప్రదించి మండపం కమిటీ సభ్యుల వివరాలు అందజేసి అనుమతి పొందాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహాల ఊరేగింపులో లౌడ్ స్పీకర్లు పెట్టవద్దని, బాణాసంచా పేల్చరాదన్నారు.



వెంకయ్యస్వామికి సింహవాహన సేవ

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : వెంకయ్యస్వామి 43వ ఆరాధ నోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం ఉదయం నిత్య పూజలతో పాటు సింహ వాహన సేవ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. జంతువుల్లో సింహం ప్రత్యేకమైనదని, అదే తరహాలో మనిషి కూడా ఇతర ప్రాణుల కంటే భిన్నమైన రీతిలో బతకాలని సూచించడాని కన్నట్లు స్వామి సింహవాహనంపై ఊరేగారు. వెంకయ్య స్వామిని కను లారా తిలకించడానికి భక్తులు పోటీలు పడ్డారు. రాత్రికి వెంకయ్య స్వామికి గరుడవాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు తమ వాకిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. గొలగమూడి గ్రామస్థులు స్వామి వారి ఊరేగింపు తమ వాకిలి ముందు ఒక్క క్షణం ఆగినా చాల న్నంత ఉద్వేగంతో కర్పూర హారతులు పట్టారు. ఆరాధనోత్స వాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం 10 గంటలకు వెంకయ్యస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. రాత్రి 8 గంటలకు ఆశ్రమ కోనేటిలో తెప్పోత్సవం, ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమం, సంస్కృతిక కార్యక్ర మాలు జరుగుతాయని ఏవో తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి స్వామికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

బియ్యం రవాణా నియంత్రణకు కావలిలో చెక్‌పోస్ట్

● జేసీ కార్తీక్

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కావలిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ అధ్యక్షతన ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఉదయం రెవె న్యూ, పోలీస్, సివిల్‌సప్లయ్, రవాణాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ముసు నూరు టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అక్కడ రెవెన్యూ, సివిల్‌సప్లయ్ ఉద్యో గులు 24/7 విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ.శ్రీ ధర్, తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్, సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'అమ్మభాషకు' వందనం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : తెలుగు భాషోద్యమం సందర్భంగా పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అమ్మభాషకు వందనం అనే కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తోమాటి సం జీవరావు రచించిన విశిష్ట తెలుగు దర్శనం పుస్తకా విష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కవులు, తెలుగుభాషాభిమానులు పాల్గొని నేటి తెలుగు భాషపై తమ అభిప్రాయాలు, కవితలు, పద్యాల రూపంలో తెలియజేయవచ్చునని తెలిపారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

నెల్లూరు (సిటీ) : ఏసీనగర్‌లో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి వారి దేవస్థానంలో ఆదివారం 18వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ శనివారం తెలిపింది. ఉదయం 4గంటలకు ధుని పూజతో ఉత్సవాలు మొదలై 5 గంటలకు సుప్రభా తం, 6 గంటలకు అభిషేకం, నిత్యపూ జలు, స్వామి వారి భిక్షాటన అన్నదానం జరగనుంది.

వామ్మో.. నకిలీ నోటు!



కురగాయల వ్యాపారికి ఇచ్చిన రూ. 200 నకిలీ నోటు

ఆత్మకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలో శనివారం నకిలీ నోటు కలకలం సృష్టిం చింది. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు కూర గాయల మార్కెట్‌లో ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈక్రమం లో ఓ గుర్తుతెలియని వ్యక్తి కూరగాయలకు వచ్చి రూ. 200 నోటు ఇచ్చి కూరగాయలు తీసుకెళ్లాడు. ఆ తరువాత వ్యాపారి ఆ నోటు పరిశీలించగా దొంగ నోటుగా తేలింది. దీంతో మార్కెట్‌లో కలకలం రేగింది. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు అప్రమత్తంగా లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపాడు..



కనువిందు చేస్తున్న వినాయకులు

రూ.వెయ్యి నుంచి రూ.3లక్షల వరకు ధరలు

'చవితి'కి గణనాథుల సిద్ధం









ఈ నెల 27న వినాయ చవితి సందర్భం గా చూడము చ్చటైన గణనాథులు సిద్ధమవుతు న్నారు. వివిధ రకాల ఆకృతు లతో ప్రతిమలను చూడ ముచ్చటగా రూపుదిద్దు తున్నారు. కళ్లకు ఇంపైన రంగులు అద్ది అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. నగరం లోని పొదలకూరు రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, ట్రంకురోడ్డు, అయ్యప్పగుడి, వేదా యపాళెం పడుగు పాడులతోపాటు కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందు కూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో సిద్ధం చేసిన గణపతులను అమ్మకాలకు పెట్టారు. ప్రజల అవసరాలకు కావాల్సినన్ని గణపతుల ప్రతిమలను బయటి ప్రాంతాల నుంచి నెల్లూ రుకు తెప్పిస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.3లక్షల వరకు ధరల్లో లభిస్తున్నాయి. అలాగే, తమ ఇష్టదేవుడ్ని కొలువుదీర్చి పూజలు చేసేందుకు యువత, కాలనీవాసులు వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే స్వచ్ఛందంగా చందాలు సేకరించారు. వీధులు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్ల ఏర్పాటు చేసి, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలను అమ ర్చుతున్నారు. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వెలిసి వున్న మహాగణపతికి చవితి వేడుకలకు ముస్తాబు చేశారు. అందమైన రంగులతో స్వామి కళక ళలాడుతున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ముస్తాబైన మహాగణపతి





ఇళ్ల అద్దెకు ఆధార్ తప్పనిసరి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఏఎస్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యాత్రా స్థలమైన ఏఎస్‌పేటలో రూములు, ఇళ్ల అద్దెకు ఇచ్చేటప్పుడు అద్దెకు వచ్చేవారి ఆధార్‌కార్డులు, పూర్తి వివరాలు తీసుకోవాలని ఆర్డీవో పావని సూచించారు. శని వారం ఆమె ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డితో కలసి స్థానిక కామక్షి కల్యాణ మండ పంలో బాడుగ రూములు, ఇళ్ల యాజమ నులు, కేర్‌టేకర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయబ్ రసూ ల్ దర్గా ఉండడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి విచ్చేస్తుంటారని, అందువల్ల రూములు, ఇళ్ల అద్దెకు ఇచ్చే సమయంలో కుటుంబంలోని అందరి గురించి పూర్తి వివ రాలు సేకరించాలన్నారు. గెస్ట్‌హౌస్‌లు, లాడ్జిల లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలి పారు. మానసిక వికలాంగులను చూసుకునే కేర్‌టేకర్లు వారి వద్ద ఉంటున్న మానసిక వికలాంగులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వేమారెడ్డి, ఎస్‌ఐ సైదులు, తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపిడివో ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీల ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారిణిలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీనియర్ క్రీడాకారుడు, బరోడా బ్యాంక్ రిటైర్డ్ జీఎం అనిల్ కుమార్ ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు జరిగిన పోటీల్లో అనంతపురం జట్టు కడప జట్టుపై 2-1 గోల్స్, ఎన్‌టీఆర్ జిల్లా ఏఎస్‌ఆర్ జిల్లాపై 5-0 గోల్స్‌తో, నెల్లూరు జట్టు ఎన్‌టీఆర్ జట్టుపై 2-0 గోల్స్‌తో, అనంతపురం జట్టు పల్నాడు జట్టుపై 10-0 గోల్స్‌తో, నెల్లూరు జట్టు ఏఎస్‌ఆర్ జట్టుపై 5-0 గోల్స్‌తో, కడప జట్టు పల్నాడు జట్టుపై 7-0 గోల్స్‌తో విజయం సాధించాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్ మధ్యాహ్నం ఫైనల్స్ జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి బీ.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు, రిఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లోని తల్లీ,బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో

వసూళ్ల పర్వం

● తాజాగా ఘటన వెలుగులోకి... ● డ్రైవర్‌ను సస్పెండ్ చేసిన డీఎంహెచ్‌వో

● పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాజాగా తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఓ డ్రైవర్ వసూళ్లకు పాల్పడిన వైనం వెలుగు చూసింది. మర్రిపాడు మండలం అనంతపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణీ నెల్లూరుకు వచ్చి జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం ఆమె ఈనెల 22న తన బిడ్డతో సొంత గ్రామానికి తిరుగు ప్రయాణం అయింది. ప్రభుత్వం ఉచితంగా ఆ బాలింతరాలిని స్వగ్రామానికి చేర్చేందుకు తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులో ఉంచింది. కాగా ఆ బాలింత గ్రామానికి చేరుకోగా డ్రైవర్ తనకు రూ. 2,500 ఇవ్వాలని కోరాడు. ప్రభుత్వం ఉచితంగా వాహన సదుపాయం ఏర్పాటు చేస్తే, ఎందుకు డబ్బులు అడుగుతున్నావని బాలింత కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. అయితే తమకు నెల వారీ వేతనాలు చాలా తక్కువని, అందుకే ఇలా వసూళ్లకు పాల్పడుతున్నామని డ్రైవర్ శ్రీను చెప్పాడు. చేసేది లేక ఆ నిరు పేద బాలింత డ్రైవర్ అడిగినంత ఇచ్చింది. ఈ సంఘటన వైరల్ కావటంతో డీఎం హెచ్‌వో డాక్టర్ సుజాత విచారణ జరిపి డ్రైవర్ శ్రీనును వెంటనే సస్పెండ్ చేసింది.

● కొరవడిన పర్యవేక్షణ

కాగా తల్లి, బిడ్డ ఎస్స్‌ప్రెస్‌లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. డీఎంహెచ్‌వో పర్యవేక్షణలోనే ఈ వాహన సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అరబిందో సంస్థ కాంట్రాక్టు నిర్వహణలో ఈ వాహ నాలు నడుస్తున్నాయి. అయితే ఆ వాహనాలు ఎక్కడికి వెళుతున్నాయి.. ఎవరెవరిని తీసుకువెళ తున్నాయి. ఏ గ్రామానికి తీసుకువెళుతున్నాయి... వంటి పర్యవేక్షణను అధికారులు మరిచిపోయారు. దీంతో తాజాగా నెల్లూరు జీజీహెచ్‌లో వసూళ్ల పర్వం వెలుగు చూసింది. ఇక్కడ నుంచి ప్రతిరోజు 6 నుంచి ఏడుగురు బాలింతలు తమ స్వగ్రామాలకు వెళ తుంటారు. అయితే స్వచ్ఛందంగా తాము ఇచ్చే రూ. 100, రూ. 200 మాత్రమే తీసుకోవాలని బాధితులు చెబుతున్నా, లేదు..లేదు... తాము అడిగినంత చెల్లించాలని కొందరు డ్రైవర్లు అక్రమార్జనకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాసు పత్రులకు ఎక్కువగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేదలే వస్తుంటారు. ఇలాంటి వారి నుంచి అక్రమార్జనకు పాల్పడటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతున్నదని వారు పేర్కొన్నారు.

వెంటనే డ్రైవర్‌ను తొలగించాం



తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా అక్రమార్జనకు పాల్పడిన డ్రైవర్‌ను విచా రించి, వెంటనే తొలగించాం. బాలింతల నుంచి ఎవరూ కూడా డబ్బులు వసూలు చేయరాదు. అలా చేస్తే చర్యలు తప్పవు. జిల్లాలో ప్రస్తుతం 19 తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్ లు ఉన్నాయి. వాటి ద్వారా బాలింతలను ఉచితంగా స్వగ్రామాలకు చేర్చుతున్నాం.

- డీఎంహెచ్ డాక్టర్ సుజాత

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుష లకు ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణపాఠశాలలో హెచ్‌ఎంవీ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఈగ మురళి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందగోరే అభ్యర్థులు ఏడాది కాలపరిమితి కలిగిన ఎల్‌ఎంవీ లైసెన్సు, హెవీ డ్రైవింగ్ ఎల్ఎల్‌ఆర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కనీస వయసు 20 ఏళ్లు ఉండాల న్నారు. అభ్యర్థులు ఈనెల 27 సాయంత్రం ఐదుగం టల లోగా నెల్లూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు సమర్పించాలని ఆయన తెలి పారు. పూర్తి వివరాలకు 94924 82756 91605 51479 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉపాధ్యాయుల మహాధర్నా

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : కేంద్ర ప్రభుత్వ మెమో నంబరు 57ను అమలు చేయాలని కోరుతూ సోమ వారం విజయవాడలో ఉపాధ్యాయుల మహాధర్నా నిర్వహించనున్నట్లు బీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బు, మాస ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 2003 ఉపాధ్యాయుల ఫోరం తరఫున చేపట్టే ఈ ధర్నాలో టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అక్రమ మైనింగ్, మనీస్కాంపై ప్రశ్నిస్తే

హత్యాయత్నం కేసు పెడతారా!? : కాకాణి

కావలి (టౌన్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్, మనీ స్కాంపై ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిపై హత్యాయత్నం కేసు పెడతారా!? అని మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ముసు నూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ క్యాంప్ కార్యాలయంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మిని కాకాణి పరామర్శించారు. ఈ సందర్భం గా విలేకరులతో కాకాణి మాట్లాడుతూ అన్నవరం క్వారీలో అక్రమ మైనింగ్ జరుగుతోందని, కావలి లో 800 కోట్ల మనీ స్కామ్ జరిగిందని మాట్లాడితే ప్రతాప్‌పై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హత్యాయత్నం కేసు పెట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేసిన తప్పులను, అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. నడిబజారులో మాజీ మంత్రి ప్రసన్న ఇంటిపై దాడి జరిగితే ఎవరు దాడి చేసేరో వారి పేర్లు కనుక్కోలేకపోయామని పోలీసులు చెప్పడం సిగ్గుచేటన్నారు.

కావలి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరించిన సాధన సమితి సభ్యులు



కావలిని జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కావలిని ప్రత్యేక జిల్లా చేయా లని కోరుతూ శనివారం స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కావలి జిల్లా సాధన సమితి సభ్యులు కరపత్రాలను ఆవిష్కరిం చారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణలో నెల్లూరు జిల్లా తీవ్రంగా నష్టపోతుందని, కావలి ప్రాంతం మరింత నష్టపోతుందన్నారు. భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలు, పోర్టులు లేని ప్రాంతంగా మిగిలి పోతుందని ఆందో ళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులలో కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, ఆత్మకూరులోని ఉత్తర ప్రాంతాలను కలిపి కావలి జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. కావలి జిల్లా చేయడా నికి అవసరమైన అన్ని వసతులు, వనరులు మెండుగా ఉన్నాయ న్నారు. కావలి జిల్లాగా ఏర్పడకపోతే భవిష్యత్తులో విద్యార్థులు పరిశ్రమలలో ఉద్యోగాలు పొందడానికి ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు లేక నాన్‌లోకల్‌గా మిగిలి పోయి నష్టపోతారన్నారు. కావలి జిల్లాగా ఏర్పడటానికి ఇది మంచి అనుకూలమైన సమయం అని, ఈ ప్రాం త ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజలు కావలి జిల్లా సాధన సమితి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో కావలి జిల్లా సాధన సమితి సభ్యులు పులి చక్రపాణి, కరువది భాస్కర్, పులి రజినీ, అక్కిలిగుంట రమేష్, గుడిపల్లి వేణు, మాకన కిషోర్, సిద్ధూ, ఐజాక్, దానియేలు పాల్గొన్నారు.